

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 31 | హైదరాబాద్ | శనివారం | 18-07-2026 | పేజీలు: 08





## బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్

నేటి బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు హైకోర్టు అనుమతి
శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ
పోలీసులు అనుమతి నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్
శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా నిర్వహించుకోవాలని స్పష్టమైన షరతులు
ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్న కేటీఆర్

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శనివారం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, బీఆర్ఎస్ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సభ నిర్వహించాలని స్పష్టం చేస్తూ అనుమతించింది. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ సభను నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రియాంక గాంధీ ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' అమలు, మిగతా 2లో..

# ధరణి లావాదేవీలపై సిట్ దర్యాప్తు..

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ముగిసిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణకు గ్రీన్ సిగ్నల్
వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు
భూ లావాదేవీల్లో అక్రమాలు, అవకతవకలపై లోతైన విచారణకు నిర్ణయం
ధరణి పోర్టల్‌లో జరిగిన అన్ని కీలక లావాదేవీలను పరిశీలించనున్న సిట్
గ్రామ పంచాయతీల సొంత ఆదాయం నేరుగా ఆయా ఖాతాల్లోనే జమ చేయాలని ఆమోదం
స్థానిక సంస్థల ఆర్థిక స్వయం ప్రతిపత్తికి ప్రభుత్వం ప్రాధాన్యం
పంచాయతీల నిధుల వినియోగంలో పారదర్శకత పెంచడమే ప్రభుత్వ లక్ష్యం
పలు పరిపాలనా, అభివృద్ధి అంశాలపైనా మంత్రివర్గంలో విస్తృత చర్చ
త్వరలో పూర్తి స్థాయి కేబినెట్ నిర్ణయాలను అధికారికంగా వెల్లడించనున్న ప్రభుత్వం



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో అమల్లో ఉన్న ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ అంశంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి అన్ని లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించాలని నిర్ణయించింది.
ధరణి పోర్టల్ అమలులో జరిగిన భూ రిజిస్ట్రేషన్లు, భూముల బదిలీలు, యాజమాన్య మార్పులు, ఫిర్యాదులు, వివాదాస్పద లావాదేవీలు, ప్రభుత్వ భూములకు సంబంధించిన అంశాలు సహా అన్ని కోణాల్లో విచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇందుకోసం రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మిగతా 3లో..




## అంతరిక్షంలోకి ప్రధాని మోదీ రాసిన పోస్ట్‌కార్డు

రేపు శ్రీహరికోట నుంచి 'విక్రమ్-1' ప్రయోగం
'మిషన్ ఆగమన్'కు స్కైరూట్ సన్నాహాలు
మోదీ చేతిరాతలో 'వందేమాతరం'
వందలాది చేతిరాత పోస్ట్‌కార్డులకు అంతరిక్ష యాత్ర
ఇస్రో మాజీ, ప్రస్తుత చైర్మన్ల సందేశాలు కూడా
భారత గడ్డపై నుంచి తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్
3డీ ప్రింటింగ్‌తో తయారైన రాకెట్ ఇంజిన్లు
350 కిలోల పేలోడ్‌ను కక్ష్యలోకి తీసుకెళ్లే సామర్థ్యం
సీవీ రామన్, సారాభాయ్, కలాంకు వినూత్న నివాళి

## ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం

కొత్త ఈహెచ్ఎస్ పోర్టల్ ప్రారంభం
ప్రభుత్వ ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) పోర్టల్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.
* ఉద్యోగుల ఎన్నో ఏళ్ల డిమాండ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చూపిందని వ్యాఖ్య.
* పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శ.
* 9.5 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరేలా కొత్త ఈహెచ్ఎస్.
* బీఆర్ఎస్ పెండింగ్‌లో పెట్టిన రూ.2 వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం చెల్లించిందని వెల్లడి.




## రాష్ట్రంలో 60 శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి వెల్లడి
సంగారెడ్డిలో సర్ శిబిరాల పరిశీలన
బీఎల్వోలతో మాట్లాడిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్
గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పూర్తి
పట్టణాల్లో 45 శాతం డిజిటైజేషన్
పార్టీ ప్రతినిధుల గుర్తింపు కార్డులపై ఆరా
గడువు దృష్టిలో పెట్టుకుని ప్రక్రియ వేగవంతం చేయాలని సూచన
పీఎల్వో, బీఎల్వోల సహకారంతో కొనసాగుతున్న సర్
ఎన్యూమరేషన్ పత్రాలపై అధికారులకు కీలక ఆదేశాలు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): రాష్ట్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని మిగతా 2లో..

## గుజరాత్‌లో జైషే మహ్మద్ ఉగ్ర కుట్ర భగ్నం

ఏటీఎస్ అదుపులో ఐదుగురు ముష్కరులు
విఫలమైన టైమ్ బాంబు పరీక్ష
ఉగ్రవాద నెట్‌వర్క్‌పై గుజరాత్ ఏటీఎస్ సర్జికల్ స్ట్రైక్
జులై 24 వరకు పోలీస్ కస్టడీకి అప్పగించిన న్యాయస్థానం
మేజిస్ట్రేట్ ఆర్.ఎం భాటియా ముందు నిందితుల హాజరు
నిందితులపై 'ఉపా' చట్టం కింద కఠినమైన సెక్షన్లతో కేసులు
దేశద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపిన అధికారులు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): పాకిస్థాన్ సరిహద్దులను ఆనుకుని ఉన్న గుజరాత్ రాష్ట్రంలో భారీ ఉగ్రవాద కుట్రను భద్రతా బలగాలు విజయవంతంగా భగ్నం చేశాయి. పాక్ కేంద్రంగా మిగతా 2లో..

విద్యార్థితో ఇస్లామిక్ ప్రార్థనలు?..

## పాఠశాలపై కేసు

సైదాబాద్‌లో ప్రైవేట్ స్కూల్‌పై తల్లిదండ్రుల ఫిర్యాదు
రెండో తరగతి విద్యార్థితో 'సూరా అల్-ఫాతిహా' పఠనం చేయించారనే ఆరోపణ
రోజూ ప్రార్థన చేయాలంటూ స్కూల్ డైరీలో నమోదు చేశారని ఫిర్యాదు
బాలుడు భయాందోళనకు గురవుతున్నాడని తల్లిదండ్రుల ఆవేదన
ప్రిన్సిపాల్, యాజమాన్యం, టీచర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): హైదరాబాద్ నగరంలోని సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి విద్యార్థితో బలవంతంగా ఇస్లామిక్ ప్రార్థనలు చేయించారనే ఆరోపణలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఈ ఘటనపై బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు మిగతా 2లో..




## దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభం

జెండా ఊపిన ప్రధాని నరేంద్ర మోదీ
పర్యావరణ పరిరక్షణలో భారత రైల్వే సరికొత్త చరిత్ర:
హరియాణాలో పట్టాలెక్కిన మొదటి హైడ్రోజన్ రైలు
జింద్ టు సోనిపట్ మధ్య పచ్చజెండా ఊపిన ప్రధాని
89 కిలోమీటర్ల దూరాన్ని రెండు గంటల్లోనే చేరిక
ప్రపంచంలోనే అతి పొడవైన ప్యాసింజర్ హైడ్రోజన్ రైలు
10 కోచ్‌లతో ఏకంగా 2,600 మంది ప్రయాణించేలా రికార్డు సృష్టి
సొంతంగా కరెంట్ తయారుచేసుకునే అద్భుత సాంకేతికత
పర్యావరణానికి ముప్పు లేని విప్లవాత్మక ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): భారతదేశ రవాణా రంగంలో పర్యావరణ విప్లవానికి నాంది పలుకుతూ భారతీయ రైల్వే ఒక అద్భుతమైన చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించింది. పర్యావరణానికి ఎలాంటి కాలుష్య భారం లేదా నష్టం వాటిల్లకుండా, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసే క్రమంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా హైడ్రోజన్ ఇంధనంతో నడిచే సరికొత్త రైలు పట్టాలెక్కింది. హరియాణా రాష్ట్ర వేదికగా ఈ సరికొత్త సాంకేతిక రైలు తన తొలి ప్రయాణాన్ని అత్యంత విజయవంతంగా ప్రారంభించి, భారత రైల్వే చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.
హరియాణాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అధికారిక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ హైడ్రోజన్ రైలును పచ్చజెండా ఊపి, మిగతా 2లో..




## మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై సీఈసీ కీలక వ్యాఖ్యలు

నామినేషన్‌లో ప్రతి కాలమ్ తప్పనిసరిగా పూర్తి చేయాలన్న జ్ఞానేష్ కుమార్.
చిన్న పొరపాటు కూడా నామినేషన్ చెల్లుబాటుపై ప్రభావం చూపుతుందన్న వ్యాఖ్య.
తెలంగాణ కోర్టు కేసు వివరాలు సమర్పించేందుకు అవకాశం ఇచ్చామని వెల్లడి.
ఆర్ఓ నిర్ణయంలో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోలేదన్న సీఈసీ.
సుప్రీంకోర్టు కూడా రిటర్నింగ్ అధికారి నిర్ణయాన్నే సమర్థించిందని స్పష్టం.

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో నిబంధనల అమలు విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మీడియాతో నిర్వహించిన ప్రత్యేక చిట్‌చాట్‌లో ఈ వివాదానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన వివరణ ఇచ్చారు.నామినేషన్ పత్రాల్లో అడిగిన ప్రతి కాలమ్‌ను అభ్యర్థులు తప్పనిసరిగా పూర్తి చేయాలని సీఈసీ తెలిపారు. చట్టసభలకు పోటీ చేసే అభ్యర్థులు ఏ చిన్న మిగతా 2లో..





# బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి

నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం వంటి అంశాలను ఈ సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు.

కోర్టులో విచారణ సందర్భంగా, ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం శాంతిభద్రతల సమస్యలు తలెత్తవచ్చని, పార్కింగ్ సౌకర్యం కూడా సరిగా లేదని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, 17 రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా ఎందుకు నిర్ణయం తీసుకోలేదని అధికారులను ప్రశ్నించింది. చివరికు, రోడ్లను దిగ్బంధించడం లేదా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా సభను శాంతియుతంగా నిర్వహించాలని బీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# రాష్ట్రంలో 60 శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా సర్ ప్రక్రియలో 60 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ 80 శాతం పూర్తికాగా, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని వివరించారు.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన సర్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. శిబిరాల్లో జరుగుతున్న నమోదు, డిజిటైజేషన్, పత్రాల పరిశీలన తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో (బీఎల్వోలు) నేరుగా మాట్లాడిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, ప్రజల నుంచి వస్తున్న స్పందన, నమోదు ప్రక్రియ పురోగతి గురించి ఆరా తీశారు. డిజిటైజేషన్ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

శిబిరాల వద్ద వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఉండటాన్ని గమనించిన సుదర్శన్‌రెడ్డి, వారికి పార్టీ గుర్తింపు కార్డులు జారీ చేశారా అని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ప్రక్రియ నిర్వహించాలని, పారదర్శకతకు ఎలాంటి భంగం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సర్ ప్రక్రియ గడువు పొడిగించిన నేపథ్యంలో మిగిలిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించేలా ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రక్రియ కొనసాగించాలని చెప్పారు. పీఎల్వోలు, బీఎల్వోల సమన్వయంతో సర్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా సజావుగా సాగుతోందన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలు అందని ప్రాంతాల్లో వెంటనే సంబంధిత సూపర్‌వైజర్లను సంప్రదించి పత్రాలు తీసుకోవాలని బీఎల్వోలకు సూచించారు. అవసరమైన ఫారాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసి, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థితో ఇస్లామిక్ ప్రార్థనలు?.. పాఠశాలపై కేసు

మొదటిపేజీ తరువాయి

నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఫిర్యాదు ప్రకారం, తరగతి గదిలో సదరు విద్యార్థితో ఇస్లామిక్ ప్రార్థనలో భాగమైన 'సూరా అల్‌ఫాతిహా' పఠనం చేయాలని ఉపాధ్యాయులు ఆదేశించినట్లు ఆరోపించారు. అంతేకాకుండా, ప్రతిరోజూ ఆ ప్రార్థన చదవాలని స్కూల్ డైరీలో కూడా సూరా అల్‌ఫాతిహా అని రాసి ఒత్తిడి తీసుకొచ్చారని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

తమ మత విశ్వాసాలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు వ్యవహరించారని, దీంతో తమ కుమారుడు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ప్రతిరోజూ ఏడుస్తూ ఇంటికి వస్తున్నాడని తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్యల వల్ల తమ మత స్వేచ్ఛతో పాటు తల్లిదండ్రుల హక్కులు కూడా ఉల్లంఘించబడ్డాయని ఆరోపిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ ఫిర్యాదు ఆధారంగా సైదాబాద్ పోలీసులు ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం, తరగతి ఉపాధ్యాయురాలిని నిందితులుగా చేర్చినట్లు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సంబంధిత సెక్షన్లతో పాటు జువెనైల్ జస్టిస్ చట్టంలోని సెక్షన్ 75 కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

విద్యార్థిపై మానసిక ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలపై అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు, పాఠశాల యాజమాన్యం వివరణ, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం స్పందన ఇంకా వెల్లడికాలేదు. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం

- **కొత్త ఈహెచ్ఎస్ పోర్టల్ ప్రారంభం**
- **ప్రభుత్వ ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) పోర్టల్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.**
- **ఉద్యోగుల ఎన్నో ఏళ్ల డిమాండ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చూపిందని వ్యాఖ్య.**
- **పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శ.**
- **9.5 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరేలా కొత్త ఈహెచ్ఎస్.**
- **బీఆర్ఎస్ పెండింగ్‌లో పెట్టిన రూ.2 వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం చెల్లించిందని వెల్లడి.**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు నూతన ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) పోర్టల్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. నగదు రహిత చికిత్స కోసం ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నెరవేర్చిందని తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమన్వయంతో పనిచేసిందని భట్టి చెప్పారు. ఇకపై వైద్య ఖర్చుల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమని, వారిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందని పేర్కొన్నారు.

సుమారు 9.5 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ఈహెచ్ఎస్‌ను తీసుకొచ్చామని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచి 1.06 కోట్ల మంది పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ.2 వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిందని భట్టి విక్రమార్క తెలిపారు.

# గుజరాత్‌లో జైషే మహ్మద్ ఉగ్ర కుట్ర భగ్నం

మొదటిపేజీ తరువాయి

పనిచేస్తున్న నిషేధిత ఉగ్రసంస్థ జైషే మహ్మద్‌కు చెందిన ఒక ప్రమాదకరమైన ముఠాను గుజరాత్ ఉగ్రవాద నిరోధక దళం అధికారులు అరెస్టు చేశారు. పటన్ జిల్లా పరిధిలోని సిద్ధ్‌పూర్ తాలూకా ఖడియాల్ గ్రామంలో ఏటీఎస్ బృందాలు జరిపిన మెరుపు దాడుల్లో ఐదుగురు ముష్కరులు పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకున్న నిందితులను బిలాల్ అబిద్‌భాయ్ షేరా, మహ్మద్ అయూబ్ కడివాలా, మహ్మద్ పాలన్‌పురి, షఫియా రాయిస్ ముక్తి, మహ్మద్ హసన్ కర్దియాగా అధికారులు అధికారికంగా గుర్తించారు.

ఖడియాల్ గ్రామంలో పట్టుబడిన ఈ ఐదుగురు జైషే మహ్మద్ నిందితులను గుజరాత్ ఏటీఎస్ అధికారులు కట్టుదిట్టమైన భద్రత మధ్య మెహసానా జిల్లా కోర్టుకు తరలించారు. అక్కడ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆర్.ఎం భాటియా ఎదుట నిందితులను హాజరుపరిచారు. ఈ ఉగ్రవాద ముఠా వెనుక ఉన్న అంతర్జాతీయ లింకులు, భవిష్యత్ దాడుల ప్రణాళికలను రాబట్టడానికి నిందితులను విచారించాల్సిన అవసరం ఉందని ఏటీఎస్ కోర్టుకు విన్నవించింది. ఏటీఎస్ వాదనలతో ఏకీభవించిన మేజిస్ట్రేట్ ఆర్.ఎం భాటియా.. నిందితులు ఐదుగురిని ఈనెల జులై 24వ తేదీ వరకు ఏటీఎస్ పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గుజరాత్ రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు, యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించేందుకు ఈ ముఠా ప్రయత్నిస్తోందని ప్రాథమిక విచారణలో తేలింది. దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించేలా వ్యవహరించిన ఈ నిందితులపై దేశంలోనే అత్యంత కఠినమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం కింద కేసులు నమోదు చేశారు. 'ఉపా' చట్టంలోని సెక్షన్లు 13, 17, 18, 38, 39లతో పాటు భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్లు 148, 61 కింద నిందితులపై దేశద్రోహం, ఉగ్రవాద నిధుల సేకరణ, కుట్రపూరిత చర్యల కింద కేసులు నమోదు చేసి ఉక్కుపాదం మోపారు. ఈ తాజా అరెస్టులు ఆకస్మికంగా జరిగినవి కావు, గత కొన్ని రోజులుగా ఏటీఎస్ జరుపుతున్న సుదీర్ఘ దర్యాప్తులో భాగమేనని అధికారులు స్పష్టం చేశారు. అంతకుముందు జులై 3వ తేదీన గుజరాత్‌లో ఉగ్ర నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్న జైషే మహ్మద్‌కు చెందిన ఎనిమిది మంది ముష్కరులను ఏటీఎస్ విజయవంతంగా పట్టుకుంది. ఆ ఎనిమిది మంది నిందితులను ప్రత్యేక బృందాలు థర్డ్ డిగ్రీ మరియు శాస్త్రీయ పద్ధతుల్లో విచారించగా, వారి ఇచ్చిన సమాచారం మరియు కీలక లీకుల ఆధారంగానే తాజాగా పటన్ జిల్లాలో తలదాచుకున్న ఈ ఐదుగురు నిందితుల పేర్లు మరియు రహస్య స్థావరాల వివరాలు బయటపడ్డాయి.

కోర్టు విచారణ సందర్భంగా ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ దంతానీ న్యాయస్థానానికి ఒక సంచలన విషయాన్ని వివరించారు. అరెస్టైన ఐదుగురు నిందితులలో ఒకరు గుజరాత్ మట్టిపై భారీ పేలుడు సంభవించేలా ఒక ప్రమాదకరమైన క్రూడ్ టైమ్ బాంబును సొంతంగా తయారు చేయడానికి ప్రయత్నించాడని కోర్టుకు తెలిపారు. అంతటితో ఆగకుండా, తయారు చేసిన ఆ బాంబు పనితీరును పరీక్షించేందుకు (టెస్టింగ్) ఒక నిర్మానుష్య ప్రాంతంలో విఫల యత్నం కూడా చేశాడని ఏటీఎస్ దర్యాప్తులో తేలిందని పీఆర్ దంతానీ న్యాయమూర్తికి వివరించారు. నిందితులను కస్టడీకి కోరడానికి గల కారణాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ దంతానీ కోర్టు ముందు ఉంచారు. నిందితులు టైమ్ బాంబును పరీక్షించడానికి ప్రయత్నించినప్పటికీ అది సాంకేతిక లోపాల వల్ల విఫలమైందని, అయితే వారు బాంబు తయారీకి ఉపయోగించిన ముడి సరుకులు, రసాయనాలు ఎక్కడి నుంచి సేకరించారు? వాటిని ప్రస్తుతం ఎక్కడ దాచిపెట్టారు? అనే విషయాలను కనుగొనాల్సి ఉందన్నారు. అలాగే నిందితుల వద్ద ఉర్దూ భాషలో ఉన్న జైషే మహ్మద్ ఉగ్రవాద ప్రచార సాహిత్యానికి సంబంధించిన నిషేధిత పుస్తకాలు ఉన్నాయని, వాటిని ఇంకా స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నందున నిందితుల రహస్య స్థావరాలకు తీసుకెళ్లి శోధించాల్సి ఉందని తెలిపారు.

గుజరాత్ ఏటీఎస్ జరిపిన లోతైన విచారణలో ఈ ఉగ్రవాద మాడ్యూల్ యొక్క సరఫరాదారుల లింకులు కూడా బయటపడ్డాయి. జులై 3న అరెస్టయిన మొదటి ముఠాలోని కీలక సభ్యుడైన మహమ్మద్ అమీన్ షేరా అనే ముష్కరుడు, తాజాగా పట్టుబడిన ఈ ఐదుగురు సభ్యుల ముఠాకు బాంబు తయారీకి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, పేలుడు పదార్థాల సామగ్రిని సరఫరా చేసినట్లు ఏటీఎస్ అధికారులు గుర్తించారు. జైషే మహ్మద్ తన ఉగ్రవాద నెట్‌వర్క్‌ను గుజరాత్‌లో బలంగా నాటడానికి ఈ ఇరు ముఠాలను ఒకదానికొకటి అనుసంధానం చేస్తూ వెనుక నుండి నడిపించిన అసలు సూత్రధారులు ఎవరనే కోణంలో దర్యాప్తు వేగవంతమైంది.

జైషే మహ్మద్ ఉగ్రసంస్థ గుజరాత్‌లోని ప్రముఖ నగరం అహ్మదాబాద్‌ను ప్రధాన కేంద్రంగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను ఒక వ్యూహం ప్రకారం విస్తరించడానికి ప్రయత్నించిందని ఏటీఎస్ స్పష్టం చేసింది. జులై 3న దొరికిన అహ్మద్, ఇబ్రహీం, ముదస్సిర్, జకారియా దురానీ, ముఫ్తీ ఫౌజాన్, మహమ్మద్ అమీన్ షేరా, మహమ్మద్ అబ్దుల్, బిలాల్ మహమ్మద్ లలో ఏడుగురు గుజరాత్‌కు చెందినవారు కాగా, ఒకరు మధ్యప్రదేశ్‌కు చెందినవారని తెలిపారు. వీరి మొబైల్ ఫోన్లను విశ్లేషించగా వందల సంఖ్యలో దేశ వ్యతిరేక డిజిటల్ ఫైళ్లు, చాటింగ్‌లు లభ్యమయ్యాయి. ఈ మాడ్యూల్ కేవలం గుజరాత్‌కే పరిమితం కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించే ప్రమాదకరమైన ప్లాన్ చేసిందని, తాజా అరెస్టులతో ఆ కుట్రలన్నీ పూర్తిగా భగ్నమయ్యాయని ఏటీఎస్ అధికారులు వెల్లడించారు.

# అంతరిక్షంలోకి ప్రధాని మోదీ రాసిన పోస్ట్‌కార్డు

- **నేడు శ్రీహరికోట నుంచి 'విక్రమ్-1' ప్రయోగం**
- **'మిషన్ ఆగమన్'కు స్కైరూట్ సన్నాహాలు**
- **మోదీ చేతిరాతలో 'వందేమాతరం'**
- **వందలాది చేతిరాత పోస్ట్‌కార్డులకు అంతరిక్ష యాత్ర**
- **ఇస్రో మాజీ, ప్రస్తుత చైర్మన్ల సందేశాలు కూడా**
- **భారత గడ్డపై నుంచి తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్**
- **3డీ ప్రింటింగ్‌తో తయారైన రాకెట్ ఇంజిన్లు**
- **350 కిలోల పేలోడ్‌ను కక్ష్యలోకి తీసుకెళ్లే సామర్థ్యం**
- **సీవీ రామన్, సారాభాయ్, కలాంకు వినూత్న నివాళి**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

భారత అంతరిక్ష రంగంలో మరో చారిత్రక ఘట్టానికి రంగం సిద్ధమైంది. ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ 'మిషన్ ఆగమన్' పేరిట రూపొందించిన 'విక్రమ్ 1' రాకెట్‌ను శనివారం శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించనుంది. భారత భూభాగం నుంచి కక్ష్యలోకి వెళ్లనున్న తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌గా విక్రమ్ 1 ప్రత్యేక గుర్తింపు పొందుతోంది.

ఈ ప్రయోగంలో సాంకేతిక పరికరాలతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా చేతితో రాసిన ఒక ప్రత్యేక పోస్ట్‌కార్డును కూడా అంతరిక్షంలోకి పంపనున్నారు. ఆ పోస్ట్‌కార్డుపై ప్రధాని 'వందేమాతరం' అని రాయడం విశేషం. ఇది భారత అంతరిక్ష ప్రయాణంలో ఒక ప్రతీకాత్మక గుర్తుగా నిలవనుంది.

ప్రధాని మోదీ పోస్ట్‌కార్డుతో పాటు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రస్తుత, మాజీ చైర్మన్లు, భారతీయ వ్యోమగాములు, స్కైరూట్ సంస్థ బృందం, సంస్థలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు, విధాన రూపకర్తలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రేయోభిలాషులు రాసిన వందలాది చేతిరాత పోస్ట్‌కార్డులను కూడా విక్రమ్ 1 అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది. భారత అంతరిక్ష రంగ అభివృద్ధికి తోడ్పడిన అనేక మంది జ్ఞాపకాలను ఈ ప్రయోగం సాక్ష్యంగా నిలపనుంది.

**భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి మైలురాయి**

విక్రమ్ 1 రాకెట్ దాదాపు ఏడు అంతస్తుల భవనం ఎత్తు ఉంటుంది. పూర్తిగా కార్బన్ కాంపోజిట్ పదార్థంతో దీనిని తయారు చేశారు. రాకెట్‌లోని ఇంజిన్లను అత్యాధునిక 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో రూపొందించారు. భూమికి సమీప కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి సుమారు 350 కిలోల పేలోడ్‌ను తీసుకెళ్లే సామర్థ్యం దీనికి ఉంది.

**విక్రమ్-ఎస్ విజయంతో ముందడుగు**

2022 నవంబరులో స్కైరూట్ సంస్థ 'విక్రమ్‌ఎస్' అనే సబ్‌ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఇప్పుడు పూర్తి స్థాయి ఉపగ్రహాలను కక్ష్యలోకి తీసుకెళ్లగల 'విక్రమ్ 1'తో మరో కీలక ఘట్టాన్ని నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.


**ముగ్గురు మహా శాస్త్రవేత్తలకు వినూత్న నివాళి**

విక్రమ్ 1 రాకెట్‌లో సాంకేతిక పరికరాలు, పోస్ట్‌కార్డులతో పాటు ప్రత్యేక మైక్రోఆర్ట్‌ను కూడా అంతరిక్షంలోకి పంపనున్నారు. భారత దేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు సర్ సీవీ రామన్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూక్ష్మ విగ్రహాలను ఈ ప్రయోగంలో పంపించనున్నారు.

మైక్రో ఆర్టిస్ట్ అజయ్ కుమార్ మట్టెవాడ 18 క్యారెట్ల బంగారంతో చిన్న రాకెట్ ఆకృతిని రూపొందించి, అందులో ఈ ముగ్గురు శాస్త్రవేత్తల సూక్ష్మ విగ్రహాలను చెక్కారు. భారత అంతరిక్ష రంగానికి వారు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా స్కైరూట్ ఈ వినూత్న నివాళిని అర్పిస్తోంది. 'మిషన్ ఆగమన్' విజయవంతమైతే భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి ఇది మరో గొప్ప మైలురాయిగా నిలవడంతో పాటు ప్రపంచ వాణిజ్య ఉపగ్రహ ప్రయోగ మార్కెట్లో భారత ప్రైవేట్ సంస్థల సామర్థ్యాన్ని మరింత బలంగా చాటనుంది.

# మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై సీఈసీ కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి



సమాచారాన్నైనా దాచిపెట్టినా లేదా ఖాళీగా వదిలినా నామినేషన్ చెల్లుబాటుపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. కొన్నిసార్లు రిటర్నింగ్ అధికారులు మానవీయ కోణంలో చిన్న తప్పులను పట్టించుకోకపోయినా.. రాజకీయ ప్రత్యర్థులు వాటిని అభ్యంతరంగా లేవనెత్తితే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని పేర్కొన్నారు. మీనాక్షి నటరాజన్ విషయంలో తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుకు సంబంధించిన వివరాలను అఫిడవిట్‌లో నమోదు చేసేందుకు రిటర్నింగ్ అధికారి తగిన అవకాశం ఇచ్చారని జ్ఞానేష్ కుమార్ తెలిపారు. అయితే ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోవడంతో రిటర్నింగ్ అధికారి స్వతంత్రంగా నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఒకసారి రిటర్నింగ్ అధికారి నిర్ణయం తీసుకున్న తర్వాత ఆ వ్యవహారంలో కేంద్ర ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకునే అవకాశం లేదని సీఈసీ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, రిటర్నింగ్ అధికారి నిర్ణయాన్నే న్యాయస్థానం సమర్థించిందని ఆయన గుర్తు చేశారు.

# దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జింద్ నుంచి సోనిపట్ స్టేషన్ల మధ్య ఉన్న సుమారు 89 కిలోమీటర్ల దూరాన్ని ఈ వినూత్న రైలు కేవలం రెండు గంటల వ్యవధిలోనే చేరుకుంటుందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రయాణ మార్గంలో జింద్ సిటీ, పాండు పిండారా, లలిత్ ఖేడా, భంబేవా, ఇషాపుర్ ఖేరి, బుటానా, ఖంద్రాయ్, గోహానా, రభ్రా, లాత్, మోహనా, బర్వాస్ని సహా మొత్తం 12 స్టేషన్లలో ఈ రైలు ప్రయాణికుల కోసం ఆగుతుందని రైల్వే శాఖ స్పష్టం చేసింది.

ఈ అత్యాధునిక రైలు కేవలం పర్యావరణ హితమైనదే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఒక అరుదైన రికార్డును సైతం తన ఖాతాలో వేసుకుంది. ఏకంగా 3,200 హార్స్ పవర్ (హెచ్‌పీ) సామర్థ్యం గల అత్యంత శక్తివంతమైన హైడ్రోజన్ పవర్ ట్రైన్ ప్రొపల్షన్ వ్యవస్థతో నడిచే ఈ రైలుకు మొత్తం 10 భారీ బోగీలను (కోచ్‌లను) అమర్చారు. ప్రపంచంలోనే మరే దేశంలోనూ లేని విధంగా, ఇంతవరకు అందుబాటులో ఉన్న హైడ్రోజన్ రైళ్లన్నింటికంటే అతి పొడవైన ప్యాసింజర్ హైడ్రోజన్ రైలుగా ఇది అంతర్జాతీయ రికార్డు సృష్టించింది. ఈ ఒకే రైలులో ఒకేసారి ఏకంగా 2,600 మంది ప్రయాణికులు అత్యంత సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు.

ప్రస్తుతం మన దేశంలో విస్తృతంగా నడుస్తున్న సాంప్రదాయ విద్యుత్ రైళ్లు పైన ఉండే కరెంట్ తీగల (ఓవర్ హెడ్ వైర్లు) నుంచి విద్యుత్‌ను గ్రహించి నడుస్తాయి. అయితే, దానికి పూర్తిగా భిన్నంగా ఈ సరికొత్త రైలుకు ఎలాంటి బాహ్య విద్యుత్ తీగలతో అవసరం లేదు. ఇది విప్లవాత్మకమైన 'హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ' సహాయంతో నడుస్తుంది. అంటే, ఈ రైలు తన ఇంజిన్ లోపలే హైడ్రోజన్‌ను విద్యుత్ శక్తిగా మార్చుకుని, సొంతంగా కరెంటును తయారు చేసుకుంటూ ముందుకు సాగుతుంది. ఈ రసాయన ప్రక్రియలో కేవలం ప్యూర్ నీటి ఆవిరి మాత్రమే ఉద్గారంగా బయటకు వస్తుంది కాబట్టి పర్యావరణానికి ఒక శాతం కూడా కాలుష్య ముప్పు ఉండదు.

పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో, మన దేశీయ ఇంజినీర్ల అద్భుత నైపుణ్యంతో రూపుదిద్దుకున్న ఈ హైడ్రోజన్ రైలు మేక్ ఇన్ ఇండియా సాధికారతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. పాతకాలపు డీజిల్ ఇంజిన్ల వల్ల విపరీతంగా వెలువడే ప్రమాదకర కార్బన్ ఉద్గారాలకు ఈ రైలు పూర్తిగా చెక్ పెట్టనుంది. అంతేకాకుండా, శిలాజ ఇంధనాల కొరత ఉన్న మన దేశంలో డీజిల్ కోసం విదేశాల నుంచి భారీగా దిగుమతులు చేసుకోవడానికి అయ్యే విదేశీ మారక ద్రవ్య భారం కూడా ఈ సాంకేతికత ద్వారా భవిష్యత్తులో క్రమంగా తగ్గుతుంది. సాధారణ డీజిల్ ఇంజన్లతో పోలిస్తే ఇది ప్రయాణ సమయంలో చాలా తక్కువ శబ్దం చేస్తూ ప్రయాణికులకు నిశ్శబ్ద వాతావరణాన్ని అందిస్తుంది.

రైలు ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈ హైడ్రోజన్ రైలు ప్రారంభంతో అంతర్జాతీయ స్థాయిలో హరియాణా రాష్ట్ర పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. భారత రైల్వే ఆధునికీకరణ రూపురేఖలను మార్చడంలో ఇది ఒక చారిత్రాత్మక ముందడుగు అని కొనియాడారు. 2014వ సంవత్సరం వరకు దేశంలో రైల్వే లైన్ల విద్యుద్దీకరణ కేవలం 30 శాతం మాత్రమే ఉండేదని గుర్తు చేస్తూ, తమ ప్రభుత్వం వచ్చిన గత 12 ఏళ్ల పాలనా కాలంలో దానిని ఏకంగా 99 శాతానికి పెంచి రికార్డు సృష్టించామని వివరించారు. భవిష్యత్ అవసరాలను ముందే గుర్తించి, ముందుచూపుతోనే తమ ప్రభుత్వం రూ.14 వేల కోట్లతో రైల్వే, రోడ్డు మౌలిక వసతుల పనులను వేగంగా చేపడుతోందన్నారు.

ప్రయాణికుల రక్షణకు ఈ రైలులో అత్యున్నత ప్రాధాన్యతనిచ్చారు. ఇందులో అమర్చిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలు హైడ్రోజన్ గ్యాస్ లీకేజీ, ఓవర్ హీటింగ్, మంటలు లేదా పొగ వంటి ఎలాంటి అత్యవసర ప్రమాదకర పరిస్థితులు తలెత్తినా కేవలం సెకన్ల వ్యవధిలోనే గుర్తించి లోకో పైలట్‌ను అప్రమత్తం చేస్తాయి. ఒకవేళ ఎక్కడైనా లీకేజీ జరిగితే, గాలి ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా డిజైన్ చేసిన ప్రత్యేక వెంటిలేషన్ వ్యవస్థ ఆ గ్యాస్‌ను గాల్లోకి పంపి పలుచబడేలా చేస్తుంది. ఒకవేళ ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటే, రైలులోని 'ఆటోమేటిక్ షట్ఆఫ్' వ్యవస్థ క్షణాల మీద తనంతట తానుగా హైడ్రోజన్ ఇంధన సరఫరాను పూర్తిగా నిలిపివేసి పెద్ద ప్రమాదాలు జరగకుండా కాపాడుతుంది.

ఈ నూతన హైడ్రోజన్ ప్యాసింజర్ రైలు వారంలో ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులు ప్రయాణికులకు నిరంతరాయంగా అందుబాటులో ఉంటుందని రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించారు. రైలును ఎల్లప్పుడూ సురక్షితమైన స్థితిలో ఉంచేందుకు వీలుగా ప్రతి ఆదివారం దీనికి ప్రత్యేక షెడ్యూల్డ్ నిర్వహణ పనులు మరియు కఠినమైన సాంకేతిక తనిఖీలను నిర్వహిస్తారు. ఇందుకోసం ప్రతి శనివారం రాత్రి ఈ రైలును ఢిల్లీలోని ప్రసిద్ధ 'షకుర్‌బస్తి వర్క్‌షాప్'నకు తరలిస్తామని, అక్కడ నిపుణులైన ఇంజినీర్ల బృందం పూర్తి తనిఖీలు పూర్తి చేసిన తర్వాతే సోమవారం ఉదయం తిరిగి హరియాణాలో ప్రయాణికుల సేవలకు పునరుద్ధరిస్తామని అధికారులు స్పష్టం చేశారు.



## ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ

- **వలిగొండ ఎంపీడీవో జి జలంధర్ రెడ్డి**

**వలిగొండ జులై 17(ప్రజాక్షేత్రం):**

భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోతుకుంట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో ఎంపీడీఓ జి. జలంధర్ రెడ్డి పాల్గొని పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలో చెత్త,మురుగు నీరు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని,నిల్వ నీటిని తొలగించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని
అధికారులను ఆదేశించారు వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా,చికున్గున్యా వంటి వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆరోగ్య శాఖ సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. గ్రామ ప్రజలు వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.
అనంతరం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకునేలా పనులు వేగవంతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ గండు రాములు, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్,ఆశా వర్కర్లు,ఆరోగ్య శాఖ సిబ్బంది,గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



## చర్ల మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాలను సందర్శించిన భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు

**భద్రాచలం,జూలై17(ప్రజాక్షేత్రం):**

భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు చర్ల మండల పర్యటనలో భాగంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర సౌకర్యాలను ఎమ్మెల్యే పరిశీలించి సమీక్ష నిర్వహించారు. అనంతరం విద్యార్థినులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి విద్యాభ్యాసం, సమస్యలు, అవసరాల గురించి తెలుసుకుని, మరింత శ్రద్ధగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారికి సూచించారు.
అలాగే పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భోజనం మరియు అన్ని ప్రాథమిక సౌకర్యాలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల మండలం అధ్యక్షులు విజయ్ నాయుడు సీనియర్ నాయకులు బ్రహ్మానంద రెడ్డి లంక రాజు,సీతాపతి రాజు సంబంధిత అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.



## యంగ్ ఇండియా పాఠశాల పనులు వేగవంతం చేయాలి

- **వచ్చే జూలైలోనే విద్యాబోధన ప్రారంభం లక్ష్యం**
- **తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు వెల్టూర్ జెడ్పీ పాఠశాల పరిశీలన కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి,జూలై 17 (ప్రజాక్షేత్రం):**

జిల్లాలో విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యతో కలిసి పరిశీలించిన కలెక్టర్, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
పాఠశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి, వివిధ భవనాల నిర్మాణ పురోగతి, మౌలిక వసతుల కల్పనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది జూలై నాటికి నూతన పాఠశాలలో విద్యాబోధన ప్రారంభమయ్యేలా పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. ఇందుకోసం పనుల వారీగా కార్యాచరణ ప్రణాళిక (వర్క్ షెడ్యూల్) సిద్ధం చేసి సమర్పించాలని, నిర్ణయించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేసిన కలెక్టర్, గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని సూచించారు.
అనంతరం పెద్దమందడి మండలం వెల్టూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి, అక్కడ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి, నిర్మాణానికి అవసరమైన వ్యయ అంచనాలను సమగ్రంగా సిద్ధం చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులు పాఠశాల స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు గుర్తించాలని, స్థలం వృథా కాకుండా ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలు చేపడితే విద్యార్థులకు ఆటస్థలం, ఇతర కార్యక్రమాలకు విశాలమైన మైదానం అందుబాటులో ఉంటుందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు.



# ధరణి లావాదేవీలపై సిట్ దర్యాప్తు..

మొదటిపేజీ తరువాయి

విజిలెన్స్, పోలీసు తదితర శాఖల అధికారులు, భూ వ్యవహారాల నిపుణులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు.
ధరణి వ్యవస్థపై గత కొంతకాలంగా వస్తున్న ఫిర్యాదులు, భూ యాజమాన్య వివాదాలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, రికార్డుల్లో మార్పులు వంటి ఆరోపణలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విచారణలో బయటపడే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.
అదే సమయంలో గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసే దిశగా కూడా కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీలకు వివిధ మార్గాల ద్వారా వచ్చే సొంత ఆదాయాన్ని నేరుగా ఆయా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని ఆమోదం తెలిపింది. దీంతో స్థానిక సంస్థలకు ఆర్థిక స్వయం ప్రతిపత్తి పెరగడంతో పాటు నిధుల వినియోగంలో పారదర్శకత మరింత మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.
పంచాయతీల ఆదాయంపై స్థానిక సంస్థలకే పూర్తి నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతం చేయడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించే అవకాశం కల్పించడం ఈ నిర్ణయంతో సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై కూడా విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిసింది. సమావేశంలో తీసుకున్న ఇతర నిర్ణయాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించే అవకాశం ఉంది.

## ఇద్దరు పిల్లలతో కలిసి బావిలోకి దూకిన తల్లి.. కొమ్మ పట్టుకుని బతికిన కొడుకు

- **- భర్త వేధింపులతో విసిగిపోయి, ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్యాయత్నం**
- **ఈ ఘటనలో తల్లి, కుమార్తె మృతి చెందగా.. కుమారుడు సురక్షితం**
- **వ్యవసాయ బావిలోని చెట్టు కొమ్మ పట్టుకుని ప్రాణాలు నిలబెట్టుకున్న బాలుడు**
- **కొడుకు అరుపులు విని బావిలో దూకి రక్షించిన తండ్రి**
- **రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలో ఈ విషాద ఘటన**

**శంకర్ పల్లి జులై 17(ప్రజాక్షేత్రం):**

నిత్యం తాగి వచ్చి వేధించే భర్తతో విసిగిపోయిన ఓ తల్లి, తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దారుణ సంఘటనలో తల్లి, కుమార్తె ప్రాణాలు కోల్పోగా, కుమారుడు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. వ్యవసాయ బావిలో సుమారు అరగంట పాటు ఓ చెట్టు కొమ్మను పట్టుకుని వేలాడుతూ ప్రాణాలను నిలబెట్టుకున్నాడు.
వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లా యలాల్ మండలానికి చెందిన ఊరుబాటి సుధాకర్, తన భార్య వసంత (35), కుమార్తె నవ్య (15), కుమారుడు వేణు(10)తో కలిసి బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి వలస వచ్చారు. అక్కడ ఓ తోటలో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే, సుధాకర్‌కు మద్యపానం అలవాటు ఉంది. ప్రతిరోజూ మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్య వసంతతో గొడవపడి, ఆమెను శారీరకంగా, మానసికంగా తీవ్రంగా వేధించేవాడు. నిన్న రాత్రి కూడా సుధాకర్ మద్యం మత్తులో భార్యతో గొడవపడ్డాడు. భర్త వేధింపులను ఇక భరించలేనని భావించిన వసంత, జీవితంపై పూర్తి విరక్తి చెందింది. తాను చనిపోతే పిల్లలు అనాథలవుతారనే ఆవేదనతో వారిని కూడా తనతోపాటే తీసుకెళ్లాలని నిర్ణయించుకుంది. అనుకున్నదే తడవుగా, అర్ధరాత్రి సమయంలో నిద్రిస్తున్న కుమార్తె నవ్య, కుమారుడు వేణును తీసుకుని సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది.



ముగ్గురూ ఒక్కసారిగా బావిలోకి దూకేశారు. అయితే, నీటిలో పడుతున్న సమయంలో బాలుడు వేణుకు బావిలోపలికి వంగి ఉన్న ఒక చెట్టు కొమ్మ చేతికి తగిలింది. ఎలాగైనా బతకాలనే ఆశతో ఆ బాలుడు ఆ కొమ్మను గట్టిగా పట్టుకుని, సుమారు అరగంట పాటు ప్రాణభయంతో వేలాడుతూ ఉండిపోయాడు. మరోవైపు ఇంట్లో భార్యాపిల్లలు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన సుధాకర్, చుట్టుపక్కల వెతకడం ప్రారంభించాడు. వ్యవసాయ బావి వద్దకు రాగానే లోపలి నుంచి కొడుకు అరుపులు వినిపించాయి. వెంటనే బావిలోకి చూడగా, కొడుకు కొమ్మ పట్టుకుని ప్రాణాలతో కొట్టుమిట్టాడడం చూసి, తక్షణమే బావిలోకి దూకి అతడిని బయటకు తీసి రక్షించాడు. కానీ, అప్పటికే వసంత, నవ్య నీటిలో మునిగిపోయి ఊపిరాడక మరణించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న శంకర్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో తల్లి, కుమార్తె మృతదేహాలను వెలికితీశారు. అనంతరం కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సర్ ప్రక్రియలో 72% శాతంతో పెద్దేముల్ గ్రామ పంచాయతీ టాప్

- **తాండూరు నియోజకవర్గంలో మొదటి స్థానంలో పెద్దేముల్ మేజర్ గ్రామ పంచాయతీ**
- **ఆగస్టు 03లోపు ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయాలి**
- **అర్హ్వత కలిగిన ఓటర్లు సర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలి**
- **పెద్దేముల్ గ్రామ పంచాయతీ 5 పోలింగ్ స్టేషన్ లలో 72% సర్ ప్రక్రియ పూర్తి**
- **పెద్దేముల్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి లాలప్ప**

**పెద్దేముల్,జూలై 17 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ గ్రామ పంచాయతీలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్ ) ఎన్యూమరేషన్ ప్రక్రియ ఇప్పటి వరకు 72% శాతం పూర్తయిందని పెద్దేముల్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి లాలప్ప తెలిపారు.శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ
పెద్దేముల్ గ్రామ పంచాయతీలో సర్ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోందని,తాండూరు నియోజకవర్గంలో అదే విధంగా పెద్దేముల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పెద్దేముల్ మేజర్ గ్రామ పంచాయతీ 72% శాతం పురోగతితో మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.గ్రామ ప్రజలందరూ బీఎల్‌వోలు (BLOలు) అందజేసిన సర్ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి తప్పనిసరిగా తిరిగి అప్పగించాలని సూచించారు.ఫారాల సమర్పణకు ఆగస్టు 03 చివరి తేదీగా నిర్ణయించబడిందని,ఆ గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మరణించి ఉంటే, వారి వివరాలను సంబంధిత బీఎల్‌వోలకు తెలియజేసి ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం ఇచ్చిన ఫార్మాట్ లో మరణ వాంగ్మూలం సమర్పించాలని సూచించారు.అలాగే రెండు చోట్ల ఓటు నమోదు (డబుల్ ఓటర్లు) ఉన్నవారు సంబంధిత వాంగ్మూలం ఇవ్వాలని,చిరునామా మారిన (షిఫ్టింగ్) ఓటర్లు తమ తాజా వివరాలను బీఎల్‌వోలకు అందించాలని తెలిపారు.
ప్రతి అర్హత కలిగిన ఓటరు సర్ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్యుమరేషన్ పత్రాలను సకాలంలో సమర్పించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి లాలప్ప విజ్ఞప్తి చేశారు.ప్రజల సహకారంతో పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



## మత్స్యగిరి గుట్ట దేవస్థానంలో టెండర్

**వలిగొండ జూలై 17(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంగ్రామం వెంకటాపురం, మండలం వలిగొండ, జిల్లా యాదాద్రి భువనగిరి. దేవస్థానం గుట్టపైన 202627 సంవత్సరమునకు గాను (1 సంవత్సర కాలమునకు) వివిధ టెండర్స్ నిర్వహించగా 1. పూలు, పూల దండలు అమ్ముకొను టెండర్స్ రూ.4,46,009 / నాయిని దయాకర్ రెడ్డి ( . 3,51,688) 2. 4. వాహనపూజా సామాగ్రి అమ్ముకోనుహక్కు 3. వాహనముల టోల్ గేట్ (మేకలబండ వద్ద) వసూలు చేసుకొనుహక్కు కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు వాయిదా వేయడమైనదని కార్యనిర్వహణాధికారి కొత్తపల్లి వెంకటయ్య ఒక ప్రకటనలో తెలియచేశారు. శ్రీయుత సహాయ కమీషనర్, దేవాదాయ శాఖ, నల్లగొండ డిప్యూట్ చేయబడిన నరేందర్ రెడ్డి కార్యనిర్వహణాధికారి, శ్రీ లింగ బసవేశ్వర స్వామి దేవాలయం పడమటి సోమారం పర్యవేక్షణలో నిర్వహించడమైనది. ఇట్టి టెండర్స్ లో గ్రామపెద్దలు, టెండర్ దారులు పాల్గొన్నారు. వాయిదా వేయబడిన టెండర్స్ నిర్వహణ వివరములను త్వరలో తెలియజేయబడును.



## శంషాబాద్ మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షులు కట్కూరి కోటేశ్వర్ గౌడ్ నియామకం.

**శంషాబాద్ జూలై17(ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉంటూ శంషాబాద్ మండలంలోని గ్రామాలన్నిటినికి అభివృద్ధి పథకాలు సమభాగాలుగా అందించడానికి నా వంతు ప్రయత్నం చేయడం జరుగుతుందని శంషాబాద్ మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షులు కట్కూరి కోటేశ్వర్‌గౌడ్ తెలిపారు.శుక్రవారం శంషాబాద్ మండలంలోని సర్పంచులందరూ కలసి ఒక ఫోరం ఏర్పడి సర్పంచుల ఫోరం అధ్యక్షులు కట్కూరి కోటేశ్వర్‌గౌడ్ ను ఎనుకోవడం జరిగిందన్నారు.అనంతరం మిగతా సభ్యులందరూ కలిసి పూర్తిస్థాయి కమిటీకి ఏకీభవించడంతో కార్యనిర్వాహ అధ్యక్షులుగా రవినాయక్,ఉపాధ్యక్షులుగా ఎలుగాని ప్రభాకర్ గౌడ్,అంకెం శ్రీలత రాజు యాదవ్,ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్,కార్యదర్శి మౌనిక ఆంజనేయులు ముధిరాజ్,లక్ష్మి లింగం కోశాధికారిసుభాష్,సలహాదారులుగా ముదావత్ బిఖ్యానాయక్,బిక్షపతి రెడ్డి నియమితులయ్యారు.



# పంటలు ఎండుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- వెంటనే నిజం సాగర్ నీటిని ఆయకట్టు రైతులకు వదలాలి
- పంట మార్పిడి విషయంలో అధికార యంత్రాంగం పూర్తిగా ఫెయిల్ అయింది
- కోటగిరి మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ఏముల నవీన్

**కోటగిరి,జులై17 (ప్రజాక్షేత్రం):**

కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టులో నింపి నిజాంసాగర్ లో ఉన్న నీటిని విడుదల చేసి నిజాం సాగర్ ఆయకట్టు రైతులను ఆదుకోవాలని బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కోటగిరి కేంద్రంలోని మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సాగు నీటిని అందించాలి రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం బీజేపీ నాయకులు కార్య కర్తలు రైతులు కలసి మండల రెవెన్యూ అధికారి గంగాధర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ... పంటలు ఎండుతున్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టులో నింపి నిజాంసాగర్ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు.లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేయడం జరుగుతుందని డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు కురవని తెలిసిన అధికారులు పంట మార్పిడి చేసే విషయంలో రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిద్రలో ఉన్నారని అన్నారు. వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏ ఒక్క రైతు పంట మార్పిడి చేయలేదని చెప్పారు. ఇప్పటికీ అధికారులు ఎన్నుతున్న పంటలను పరిశీలించిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటడం వల్ల నాట్లు వేసిన 20 రోజులకే బోర్లు ఎత్తిపోతున్నాయని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం నిజాంసాగర్ నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరారు. ఓవైపు మంజీరా నది నుండి ఇసుక నిత్యం తరలిస్తున్నా పట్టించుకోకపోవడం వల్లే భూగర్భ జలాలు అడుగంటి పోయాయని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిజాంసాగర్ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. రైతు బాంధవుడిని అని చెప్పుకునే ఎమ్మెల్యే పోచారం రైతుల పంట పొలాలు ఎండకుండా నిజాంసాగర్ నీటిని విడుదల చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ సీనియర్ నాయకులు మార్కెల్లి ప్రకాష్ పటేల్, పైడిమల్ లక్ష్మీనారాయణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు, గూడూరి ప్రశాంత్ గౌడ్, పేరుక రామన్న, పుల్లల మోహన్ రావు, హౌగిరిరావు దేశాయ్,పార్వతి మురళి,
సాయి కుమార్, గౌడ్,గుంజరిజగదీష్, శ్యామ్, వెంకటేష్, గజేందర్, కుర్లెపు గంగాధర్, రేపల్లి సాయి ప్రసాద్,నడిపి రాజేష్, మామిడి శ్రీనివాస్, నరేష్,వడ్లశ్యామ్, నల్లోల సాయిలు, మహిళా మోర్చా జిల్లా నాయకురాలు కులకర్ణి శ్యామల , తిరుమలాపూర్ విజయ్,రాజు పటేల్,మక్కయ్య,నాగనాథ్ పటేల్,పుప్పాల రవి,మేకల గంగాధర్,జగదీష్,సుంకుని సాయిలు,వినోద్ కుమార్, సాయికుమార్,రమేష్,ఎర్రోళ్ల గంగాధర్,మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.



# వేగవంతంగా ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి..

- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి..
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా..
- కొత్తపల్లి, ములకనూరు, చిగురుమామిడిలో రోడ్డు నిర్మాణం అలైన్మెంట్ పరిశీలన

**చిగురుమామిడి,జూలై 17 (ప్రజాక్షేత్రం):**

కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఫోర్‌లైన్ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.

శుక్రవారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి, చిగురుమామిడి మండల కేంద్రం, ముల్కనూరు గ్రామాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఫోర్‌లైన్ రహదారికి సంబంధించిన భూసర్వే, అలైన్‌మెంట్ పనులను పరిశీలించారు. ఫేజ్ 1 కింద కొత్తపల్లి నుంచి సుందరగిరి వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎక్కడైనా నివాస గృహాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందా, ప్రత్యామ్నాయంగా బైపాస్ మార్గాల ఏర్పాటు సాధ్యమా అనే అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే గ్రామసభలు నిర్వహించి స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించి, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారి పనులు చేపట్టాలని, భూసర్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పనులు చేపడుతూనే ప్రజల ఇళ్లకు, జీవన విధానానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ షర్మిల, తిమ్మాపూర్, చిగురుమామిడి తహసీల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, ఆర్ అండ్ బి డీఈ కిరణ్,ఏఈ సురేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.







# స్వామీజీ ఆశ్రమంలో గంజాయి సాగు గుట్టు రట్టు.

- టాస్క్ ఫోర్స్ దాడుల్లో 25 గంజాయి మొక్కలు,ఎండు గంజాయి స్వాధీనం.
- ఆశ్రమంలో స్వామీజీ తో పాటు మాతాజీ నివాసం.
- కేసు నమోదు దిశగా విచారణ,

**యాలాల జూలై 17(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా యాలాల మండలం అనుబంధ గ్రామం గోవిందరావుపేటలో శుక్రవారం పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు.ఓ స్వామీజీ ఆశ్రమంలో గంజాయి సాగు జరుగుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఈ దాడులు చేశారు. గోవిందరావుపేట శివారులో ఉన్న స్వామీజీ ఆశ్రమంపై టాస్క్ ఫోర్సు సిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో సుమారు 25 గంజాయి మొక్కలతో పాటు ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు.ఈ దాడుల్లో తాండూరు రూరల్ సీఐ,ప్రవీణ్ కుమార్ రెడ్డి,టౌన్ సీఐ, పరమేశ్వర్,ఎక్సైజ్ ఎస్సై నిజాముద్దీన్,యాలాల ఎస్ఐ, విట్టల్,ఆర్ ఐ,శివ చరణ్, తదితర అధికారులు పాల్గొని సంఘటన స్థలంలో పంచనామా నిర్వహించారు.స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు, ఎండు గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.



# చెక్కు ల్యాప్స్... సాయం ఎప్పుడో?

- ముఖ్యమంత్రి సహాయనిధి కోసం మూడేళ్లుగా పేద కుటుంబం ఎదురుచూపులు
- అనారోగ్యంతో అప్పులపాలు...
- రూ.47,500 అందక అవస్థలు
- అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితురాలు

**వనపర్తి,జూలై 17(ప్రజాక్షేత్రం):**

తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రి ఖర్చులు భరించలేక అప్పులపాలైన ఓ నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన సాయం కూడా అందకుండా పోవడంతో ఆ కుటుంబం మూడేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అధికారుల నిర్లక్ష్యం, శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా చెక్కు ల్యాప్స్ కావడంతో ఇప్పటికీ కొత్త చెక్కు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో బాధిత కుటుంబం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. వనపర్తి మున్సిపల్ పరిధిలోని మారెమ్మకుంట 15వ వార్డుకు చెందిన తులసి తన కుమార్తె శ్రీవల్లికి 2023లో తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రిలో చికిత్స చేయించారు. వైద్య చికిత్సకు భారీగా ఖర్చు కావడంతో కుటుంబ సభ్యులు అప్పులు చేసి చికిత్స అందించారు. రోజువారీ కూలీపై ఆధారపడే ఈ కుటుంబానికి లక్షల రూపాయల వైద్య ఖర్చులు భారంగా మారాయి.

బాధిత కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని వైద్య బిల్లుల అసలు ప్రతులతో ముఖ్యమంత్రి సహాయనిధికి అప్పటి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ద్వారా దరఖాస్తును ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించారు. పరిశీలించిన అధికారులు 2023 సెప్టెంబర్ 14న ఎస్‌బీఐ చెక్కు నంబర్ 702966 ద్వారా రూ.47,500 మంజూరు చేశారు. అనంతరం కొంత ఆలస్యంగా ఆ



చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.

అయితే చెక్కు బాధితుల చేతికి చేరేసరికి దాని గడువు ముగియడంతో బ్యాంకు అధికారులు నగదు చెల్లించేందుకు నిరాకరించారు. దీంతో చెక్కును తిరిగి ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు. కొత్త చెక్కు జారీ అవుతుందని ఆశించిన కుటుంబానికి నిరాశే ఎదురైంది. సీఎం సహాయనిధి విభాగాన్ని పలుమార్లు సంప్రదించినా, "చెక్కు మా వద్ద లేదు", "సంబంధిత ఫైలు అందలేదు" అనే సమాధానాలే వినిపిస్తున్నాయని బాధితులు వాపోతున్నారు.

ఇప్పటికే అనారోగ్యంతో ఆస్పత్రుల చుట్టూ తిరిగి ఆర్థికంగా చితికిపోయిన ఈ కుటుంబం, మరోవైపు అప్పులు తీర్చలేక తీవ్ర మానసిక వేదనకు గురవుతోంది. ప్రభుత్వమే మంజూరు చేసిన సాయం కూడా అందకపోవడంతో తమ పరిస్థితి మరింత దయనీయంగా మారిందని కన్నీటి పర్యంతమవుతున్నారు. అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగేందుకు ప్రయాణ ఖర్చులు కూడా భరించలేని స్థితికి చేరుకున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పేదల వైద్య అవసరాల కోసం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి నిజమైన లబ్ధిదారులకు సకాలంలో చేరాల్సి ఉండగా, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ కుటుంబం మూడేళ్లుగా న్యాయం కోసం ఎదురు చూడాల్సి రావడం విమర్శలకు తావిస్తోంది.

సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ల్యాప్స్ అయిన చెక్కును పునరుద్ధరించి, కొత్త చెక్కును జారీ చేసి బాధిత కుటుంబానికి మంజూరైన రూ.47,500ను అందజేయాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# అక్రమ ఇసుక డంపింగ్ యార్డ్ ను తొలగించాలని లారీ అసోసియేషన్ సభ్యులు తాసిల్దార్ కు వినతి పత్రం అందజేత.

**శంషాబాద్ జూలై17 (ప్రజాక్షేత్రం):**

అక్రమ ఇసుక డంపింగ్ యార్డ్ ను తొలగించాలని శంషాబాద్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం శంషాబాద్ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రల నుండి రాత్రి వేళ సమయంలో అక్రమ ఇసుక తీసుకువచ్చి డంపింగ్ చేస్తున్నారు.అక్రమ ఇసుక డంపింగ్ యార్డ్ పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాజు ముదిరాజ్, మైలారం నందు,మహేందర్ రెడ్డి,మహేందర్ గౌడ్,సుధాకర్,శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# రూ.290 కోట్ల హ్యామ్ రహదారి పనులకు నేడు శంకుస్థాపన

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చొరవతో తాండూరుకు రూ.290 కోట్ల అభివృద్ధి వరం
- తాండూరు అభివృద్ధిలో మరో చారిత్రాత్మక ఘట్టం
- తాండూరులో నేడు రాష్ట్ర మంత్రుల పర్యటన
- రూ.25 కోట్ల పరిహార చెక్కుల పంపిణీ, 'ప్రగతి సభ' నిర్వహణ

**పెద్దేముల్,జూలై 17 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో నేడు (శనివారం )పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.రాష్ట్ర మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి లు పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది వెల్లడించారు.

అందులో భాగంగా నేడు(శనివారం )ఉదయం 10 గంటలకు అంతారం గ్రామ పరిధిలో రూ.290 కోట్ల వ్యయంతో చేపట్టనున్న హ్యామ్ (HAM) రహదారి అభివృద్ధి పనులకు మంత్రులు, స్పీకర్, ఎమ్మెల్యే సంయుక్తంగా శంకుస్థాపన చేయనున్నారు.ఈ ప్రాజెక్టు పూర్తయితే తాండూరు నియోజకవర్గంలో రహదారి మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడనున్నట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు.అనంతరం ఉదయం 10:15 గంటలకు కందనెల్లి గ్రామ పరిధిలోని జీపీఆర్ గార్డెన్స్‌లో బైపాస్ రహదారి భూనిర్వాసితులకు రూ.25 కోట్ల పరిహార చెక్కులను పంపిణీ చేయనున్నారు.ఇదే వేదికపై "ప్రగతి సభ"ను కూడా నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అభిమానులతో పాటు తాండూరు నియోజకవర్గ ప్రజలందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది విజ్ఞప్తి చేశారు.ఈ అభివృద్ధి కార్యక్రమాలు తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక మైలురాయిగా నిలుస్తాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు చేపట్టాలి

- జాయింట్ సీపీ చందనా దీప్తి
- రైడర్ల ప్రాణాలు ముఖ్యం.. హెల్మెట్ ధారణపై అవగాహన పెంచాలి
- ఉత్తమ సిబ్బందికి రివార్డుల ప్రదానం

**చేవెళ్ల/మొయినాబాద్ ,జూలై 17 (ప్రజా క్షేత్రం):**

రోడ్డు ప్రమాదాల నివారణకు క్షేత్రస్థాయిలో కఠినమైన చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ అండ్ అడ్మిన్ జాయింట్ పోలీస్ కమిషనర్ జి. చందనా దీప్తి ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణను, రికార్డులను పరిశీలించిన జాయింట్ సీపీ, సిబ్బంది పనితీరును, టార్నౌట్‌ను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, మైనర్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అలాంటి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, కోర్టు ద్వారా సరైన జరిమానాలు పడేలా చూడాలన్నారు. ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనదారుల్లో హెల్మెట్ ధారణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించిన ఆమె, అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ్ ఐపీఎస్, ఏసీపీ చంద్రశేఖర్,ఇన్స్పెక్టర్ బి. సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
18.07.2026
శనివారం | హైదరాబాద్

# కేవలం డిగ్రీ సర్టిఫికేట్ కోసమే చదవొద్దు.. లక్ష్యసాధనకు ప్లానింగే ముఖ్యం!

- **సివిల్స్ సాధించాలంటే డిగ్రీ నుంచే పునాది పడాలి**
- **ఇంగ్లీష్‌పై గ్రిప్ కోసం ఆ 'ఐదు సూత్రాలు' పాటించండి**
- **పోటీ పరీక్షల అవగాహన సదస్సులో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. కాంచనలత**

**మొయినాబాద్,జులై 17(ప్రజాక్షేత్రం):**

విద్యార్థులు ఉన్నత విద్యను కేవలం డిగ్రీ సర్టిఫికేట్ సాధనకే పరిమితం చేయకుండా, సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. కాంచన లత పిలుపునిచ్చారు. కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పోటీ పరీక్షల ప్రత్యేక అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జీవితంలో అనుకున్న ఉన్నత స్థానాలను అధిరోహించడానికి పక్కా ప్రణాళికే రాజమార్గమని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. ఎం. రమేష్ బాబు మాట్లాడుతూ.. నేటి తీవ్రమైన పోటీ ప్రపంచంలో విజేతలుగా నిలవాలంటే కేవలం పాఠ్యపుస్తకాల చదువు ఒక్కటే సరిపోదని, దాంతో పాటు వ్యక్తిత్వ వికాసం, నిరంతర నైపుణ్యాభివృద్ధి, కఠినమైన క్రమశిక్షణను అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రొఫెసర్ ఎం.ఏ. మాలిక్ విద్యార్థులకు డిగ్రీ అనంతరం ఉన్న గ్రూప్I, గ్రూప్II, బ్యాంకింగ్ వంటి పలు ఉద్యోగ అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. నేటి రోజుల్లో ఏ పోటీ పరీక్షలోనైనా రాణించడానికి ఆంగ్ల భాషా ప్రావీణ్యం, కంప్యూటర్ నైపుణ్యాలు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఇంగ్లీష్‌పై పట్టు సాధించేందుకు నిత్యం వినడం, గట్టిగా చదవడం, ఆంగ్లంలోనే ఆలోచించడం, ధైర్యంగా మాట్లాడడం, స్పష్టంగా రాయడం అనే ఐదు సూత్రాలను నిత్య జీవితంలో పాటించాలని కోరారు. సివిల్స్ లాంటి ప్రతిష్టాత్మక పరీక్షల్లో ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ దశలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే పునాది వేసుకోవాలన్నారు.విజయం అనేది ఎవరి కుటుంబ నేపథ్యంపై ఆధారపడి ఉండదని,కేవలం స్పష్టమైన లక్ష్యం,పట్టుదల,ఆత్మవిశ్వాసం ఉంటే ఎవరైనా సాధించవచ్చని వక్తలు స్పష్టం చేశారు.



# నిరుపేద కుటుంబం నుంచి నీట్‌లో ప్రతిభ చాటిన మోడెం మేఘన

**బూర్గంపాడు జూలై 17 (ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోతేపట్టి నగర్ గ్రామానికి చెందిన మోడెం మేఘన ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకుంది.కష్టపడే తత్వం, పట్టుదల ఉంటే ఆర్థిక ఇబ్బందులు విజయానికి అడ్డుకావని ఆమె మరోసారి నిరూపించింది.మేఘన తల్లిదండ్రులు మోడెం వెంకటేశ్వర్లు, వెంకటరమణ.నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకుని నిరంతర శ్రమతో ఈ విజయాన్ని సాధించింది.మేఘన పదో తరగతిని సారపాకలోని ఎంఎస్ఆర్ స్కూల్లో ఉత్తమ ఫలితాలతో పూర్తి చేసింది. అనంతరం భద్రాచలంలోని లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివి అత్యధిక మార్కులు సాధించింది.అదే క్రమశిక్షణతో నీట్ పరీక్షకు సిద్ధమై అద్భుత ప్రతిభ కనబరిచింది.మేఘన విజయంపై కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఆమె ప్రతిభావంతమైన వైద్యురాలిగా ఎదిగి సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మేఘన మామయ్య నాని మాట్లాడుతూ, "పై చదువులు చదవాలనే ఆలోచనే కష్టంగా ఉండే పరిస్థితుల్లోనూ మేఘన డాక్టర్ కావాలనే లక్ష్యంతో అంకితభావంతో కష్టపడి ఈ విజయాన్ని సాధించింది.ఈ విజయం మా కుటుంబానికే కాకుండా మా గ్రామానికీ ఎంతో గర్వకారణం. మా ఆనందాన్ని మాటల్లో చెప్పలేం" అని భావోద్వేగంగా తెలిపారు.మేఘన సాధించిన ఈ విజయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని గ్రామస్తులు, విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.లక్ష్యంపై దృష్టి, కృషి, ఆత్మవిశ్వాసం ఉంటే ఎలాంటి పరిస్థితులనైనా అధిగమించి విజయాన్ని సాధించవచ్చని మేఘన మరోసారి చాటిచెప్పింది.



# సర్పంచ్ తాటి వాణి ఆధ్వర్యంలో విద్యుత్ మరమ్మత్తు పనులు

- **గ్రామంలో విద్యుత్ సరఫరా మెరుగుదలకు చర్యలు**

**బూర్గంపాడు జూలై 17 (ప్రజాక్షేత్రం):**



కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో సర్పంచ్ శ్రీమతి తాటి వాణి ఆధ్వర్యంలో విద్యుత్ మరమ్మత్తు పనులు చేపట్టారు. గ్రామంలో తరచూ తలెత్తుతున్న విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ఇతర లోపాలను గుర్తించి మరమ్మత్తు పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నారు.ఈ పనులను సర్పంచ్ తాటి వాణి స్వయంగా పరిశీలించి, పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.గ్రామ ప్రజలకు ఎలాంటి అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా కొనసాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా సర్పంచ్ తాటి వాణి మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.సకాలంలో విద్యుత్ మరమ్మత్తు పనులు చేపట్టినందుకు గ్రామ ప్రజలు సర్పంచ్ తాటి వాణి గారికి అభినందనలు తెలియజేస్తూ, గ్రామ సమస్యల పరిష్కారంలో ఇదే విధమైన చొరవ కొనసాగించాలని కోరారు.

# ఓటర్ల లిస్టు సవరణకు సహకరించండి.. రాజకీయ పార్టీలకు మున్సిపల్ బాస్ ల పిలుపు!

- **వార్డుల వారీగా లోపాలను సవరించేందుకు ప్రత్యేక కసరత్తు**
- **కలెక్టర్ ఆదేశాలతో చేవెళ్ల మున్సిపల్ ఆఫీసులో అఖిలపక్ష సమావేశం**

**మొయినాబాద్,జులై 17(ప్రజాక్షేత్రం):**

అర్హులైనా ప్రతి ఒక్కరు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని మున్సిపల్ కమీషనర్ యాదగిరి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో "సర్ ఓటర్ల జాబితా సవరణ" ప్రక్రియపై అఖిల పక్ష రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బి. యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు, జాబితాలోని తప్పులను సవరించేందుకు ఈ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అత్యంత కీలకమన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కౌన్సిలర్లు పరస్పర సమన్వయంతో వ్యవహరించి వార్డుల వారీగా సవరణలను విజయవంతం చేయాలని కోరారు. అందరి సహకారంతో ఈ ప్రక్రియను వంద శాతం పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు,వివిధ పార్టీల ముఖ్య నాయకులు దేవర వెంకటరెడ్డి, ఆగిరెడ్డి,ఆనంతరెడ్డి,మంగలి బాలరాజ్,మున్సిపల్ మేనేజర్లు ఉమేందర్ సింగ్,వెంకటేష్, నరేందర్,బీఎల్ఓలు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై దాడి...రూ.6,120 నగదు స్వాధీనం

- **మారేపల్లిలో పేకాటరాయుళ్ళకు పెద్దేముల్ పోలీసుల షాక్**
- **ఐదుగురు పట్టివేత.. రూ.6,120 నగదు,5 సెల్‌ఫోన్లు స్వాధీనం**
- **మరో ఐదుగురు నిందితులు పరార్**

**పెద్దేముల్,జూలై 17 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మారేపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పెద్దేముల్ పోలీసులు శుక్రవారం ఆకస్మికంగా దాడి నిర్వహించారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న బోయిని నర్సింహులు ,చాకలి రాజు,మాక్సూద్, కలీం, శ్రీనివాస్ రెడ్డి,నర్సింహులు, బస్వపురం నర్సిములు, చంద్రశేఖర్ రెడ్డి,చాపల హన్మప్ప లు మొత్తం 10 మంది ఉండగా అందులో ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకోగా ,మరో ఐదుగురు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.

పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.6,120 నగదు, 05 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులను సీజ్ చేసి,నిందితులపై జూద నిరోధక చట్టాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.పరారీలో ఉన్న వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ప్రజలు తమ పరిసరాల్లో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ విజ్ఞప్తి చేశారు.ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందని ఆయన పేర్కొన్నారు.



# జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమస్యలను వెంటనే పరిష్కరించాలి:ఎస్ఎఫ్ఐ.

**శంషాబాద్ జులై17 (ప్రజాక్షేత్రం):**

జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు విద్యాశాఖ వెంటనే కల్పించాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కే.వై.ప్రణయ్ తెలిపారు.శుక్రవారం ఎస్ఎఫ్ఐ శంషాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో శంషాబాద్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కే.వై.ప్రణయ్ మాట్లాడుతూ..పాఠశాల ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నప్పటికీ ఇప్పటి వరకు విద్యార్థినులకు యూనిఫామ్‌లు అందజేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.అలాగే పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత సరిగా లేదని,బియ్యం నాణ్యత లేకపోవడం వల్ల అన్నం మెత్తగా ఉండి విద్యార్థినులు తినలేకపోతున్నారని తెలిపారు.విద్యార్థులతో భోజనం చేస్తూ చర్చించగా సుమారు 30 శాతం మంది విద్యార్థినులు మధ్యాహ్న భోజనం చేయకుండా ఇంటి నుంచే టిఫిన్లు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యను మండల విద్యాధికారి (ఎంఈఓ) కి ఫోన్ చేసి వారి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.వెంటనే అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యం కొనసాగిస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలోని మూత్రశాలలను వెంటనే శుభ్రపరచాలని సూచించారు. పరిశుభ్రత లేకపోతే విద్యార్థినులు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సాయి వర్ధన్,రుద్రాక్ష,బిట్టు,హర్ష తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యామ్నాయ పంటలతోనే లాభాలు

- **ఏఓ శంకర్ లాల్**

**మొయినాబాద్ జూలై 17(ప్రజాక్షేత్రం):**



వర్షాభావ పరిస్థితులను తట్టుకుని, తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం పొందేందుకు రైతులు ప్రత్యామ్నాయ స్వల్పకాలిక పంటల సాగుపై దృష్టి సారించాలని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్ సూచించారు. 60 నుండి 100 రోజుల్లో దిగుబడినిచ్చే పెసర, మినుములు, నువ్వులు, సజ్జలు, జొన్న రకాలతో పాటు అంతర పంటలుగా కంది+పెసర, పత్తి+పెసర సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు. పరిమిత నీటి వనరులున్న చోట డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల్లో టమాట, మిరప, వంకాయ వంటి కూరగాయలు సాగు చేసి మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. మల్చింగ్ టెక్నాలజీ, వ్యవసాయ కుంటల ద్వారా నీటిని సంరక్షించుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల నష్టాల నుండి రక్షణకు రైతులు పంట బీమాను సద్వినియోగం చేసుకోవాలని శంకర్ లాల్ కోరారు.



# ఎల్ నినో ప్రభావం పై రైతులకు అవగాహన.

- **పాడి పంటల సాగుపై తగు సూచనలు**
- **వ్యవసాయ అధికారి శ్వేతా రాణి.**

**యాలాల జూలై 17(ప్రజాక్షేత్రం):**

యాలాల మండలంలో అగ్గనూర్ గ్రామంలో రైతులకు ఎల్ నినో ప్రభావం ,ప్రస్తుత వర్ష భావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ, పంటల సాగుపై విస్తృత అవగాహన శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎ.శ్వేతా రాణి మాట్లాడుతూ ప్రస్తుత ఎల్ నినో పరిస్థితిల కారణంగా వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరం ఉండే వరి పంట సాగు విస్తీర్ణాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు. వరికి బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల కందులు రాగులు, జొన్నలు, చిరుధాన్యాలు వంటి పంటలను సాగు చేయడం వల్ల తక్కువ నీటితో మంచి దిగుబడి సాధించవచ్చు అని వివరించారు. అలాగే ఇప్పటికే సాగులో ఉన్న పంటలలో నీటి ఒత్తిడి వల్ల వంట వాడిపోకుండా ఉండేందుకు 2 శాతం యూరియా పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఇది పంట ఎదుగుదలకు తోడ్పడడంతోపాటు నీటి కొరత ప్రభావాన్ని కొంతవరకు తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎఈఓ గోపి, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా ర్యాంకర్‌కు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సన్మానం

- **ఐఐఐటీలో సీటు సాధించిన తేజేశ్వర్‌కు అభినందనలు**
- **ఉన్నత శిఖరాలు అధిరోహించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్ష**

**వనపర్తి,జూలై 17 (ప్రజాక్షేత్రం):**



వనపర్తి పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన నాగనమోని శ్రీలత-రాములు దంపతుల కుమారుడు తేజేశ్వర్ ఇటీవల నిర్వహించిన ఐఐఐటీ ప్రవేశ పరీక్షల్లో ఆల్ ఇండియా స్థాయిలో 792వ ర్యాంకు సాధించి, గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ ఐఐఐటీలో సీటు పొందాడు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన నివాసంలో శుక్రవారం తేజేశ్వర్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు.

నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి ఐఐఐటీలో ప్రవేశం పొందడం వనపర్తి పట్టణానికి గర్వకారణమని అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు పేద ప్రజలకు సేవ చేసి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. విద్యార్థి ప్రతిభను అభినందిస్తూ నూతన వస్త్రాలను బహూకరించి ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో కె. మాణిక్యం, కౌన్సిలర్ స్వాతి హరిబాబు, రఘువర్ధన్ రెడ్డి, ధర్మా నాయక్, హేమంత్ ముదిరాజ్, గంగ ప్రసాద్, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
18.07.2026
శనివారం | హైదరాబాద్

# నోటీసు లేకుండా ఓట్లు తొలగిస్తే చర్యలు

- **కలెక్టర్ అనురాగ్ జయంతి**



**వలిగొండ జూలై 17(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీలో నోటీసులు ఇవ్వకుండా ఓటర్ల పేర్లు తొలగించిన ఘటనపై కలెక్టర్ అనురాగ్ జయంతి స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు పాటించకుండా, ముందస్తు సమాచారం లేకుండా ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించరాదని స్పష్టం చేశారు.

# నాదర్ గుల్ బడంగ్ పేట రోడ్డు బాగుచేయండి

- **కే ఎల్ ఆర్ కు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం**

**మహేశ్వరం జులై 17 (ప్రజాక్షేత్రం):**

నాదర్ గుల్, ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో అనేక ఇంజినీరింగ్, డిగ్రీ, ఇంటర్ కాలేజీలు, టాటా కంపెనీలు ఉండటంతో నిత్యం నాదర్ గుల్ - బడంగ్ పేట ప్రధాన రహదారి రద్దీగా మారింది. కొద్ది నెలలుగా రోడ్డును సగం సగం వేసి వదిలేయటంతో వాహన ప్రమాదాలు పెరిగి యువకులు ప్రాణాలు కోల్పోవటం... యాక్సిడెంట్స్ అవుతున్నాయని నాదర్ గుల్ కాంగ్రెస్ నేతలు వాపోతున్నారు.

ఈ విషయంపై తుక్కుగూడ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వీలైనంత త్వరగా రోడ్డు బాగు చేయాలని కోరారు.

వెంటనే స్పందించిన కేఎల్ఆర్... జోనల్ కమిషనర్ సహా సంబంధిత అధికారులతో మాట్లాడారు. విద్యుత్ స్తంభాలను తొలగించిన వెంటనే రోడ్డు మరమ్మత్తు పనులను మొదలు పెడతామని తెలిపారు. నిత్యం రద్దీగా మారిన ఆదిభట్ల నాదర్ గుల్ - బడంగ్ పేట రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టేందుకు కావాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు లక్ష్మారెడ్డి కిచ్చెన్నగారు చెప్పారు. అధికారులు సమన్వయంతో కలిసి పని చేసి త్వరగా రోడ్డు విస్తరణ పూర్తి చేయాలని కెఎల్ఆర్ కోరారు. ఈ కార్యక్రమంలో నాదర్ గుల్, బడంగ్ పేట డివిజన్ నాయకులు సహ స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# చందాపూర్‌కు ప్రత్యేక బస్సు కోసం వినతి

- **విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ఉదయం 8.30 గంటలకు బస్ సర్వీస్ నడపాలని డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి**

**వనపర్తి,జూలై 17 (ప్రజాక్షేత్రం):**

వనపర్తి నుంచి చందాపూర్ గ్రామానికి ఉదయం వేళ ప్రత్యేక బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజాప్రతినిధులు ఆర్టీసీ అధికారులను కోరారు. శ్రీనివాసపూర్ గ్రామం నుంచి చందాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే పాఠశాల ప్రారంభ సమయానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ చందాపూర్ గ్రామ ప్రజాప్రతినిధులు శుక్రవారం వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. వనపర్తి నుంచి ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలకు చందాపూర్‌కు ప్రత్యేక సెటిల్ బస్సు నడిపితే విద్యార్థులతో పాటు ఉద్యోగులు, గ్రామ ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

వినతిపత్రాన్ని గ్రామ నాయకులు బర్ల మహేందర్, 6వ వార్డు సభ్యుడు రాములు, మాజీ మార్కెట్ కమిటీ సభ్యుడు చింతకుంట మద్దిలేటి, బాలస్వామి అందజేశారు. సమస్యను పరిశీలించి సాధ్యమైనంత త్వరలో చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

హరిజన కాలనీలో హైమాస్ట్ వెలుగులు

ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్, ఎల్ఈడీ లైట్లను ప్రారంభించిన సర్పంచ్ బర్ల నిర్మల మహేందర్ చందాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని హరిజన కాలనీలో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్, ఎల్ఈడీ లైట్లను గ్రామ సర్పంచ్ బర్ల నిర్మల మహేందర్ శుక్రవారం ప్రారంభించారు. బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు రవి చంద్ర స్థానికాభివృద్ధి నిధుల ద్వారా ఈ లైట్లను ఏర్పాటు చేశారు.

హైమాస్ట్ లైట్ అందుబాటులోకి రావడంతో కాలనీలో రాత్రి వేళల్లో వెలుతురు సమస్య తొలగి ప్రజలకు భద్రతతో పాటు రాకపోకలు సులభతరం అవుతాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తమ పంచాయతీ కృషి కొనసాగుతుందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుల్లరి నరేందర్, వార్డు సభ్యులు రాములు, రామస్వామి, రాఘవేంద్ర, శ్యాం యాదవ్, నాగమ్మ, చింతకుంట స్వామి, బజారు తిరుపతమ్మ, వరలక్ష్మి, గ్రామ యువకులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డాక్టర్ కె.వి.రెడ్డి మెమోరియల్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**నిజామాబాద్ జూలై 17(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండల కేంద్రంలోని కోడిచెర్ల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినారు ఈ కంటి ఉచిత శిబిరంలోని 16 మంది మోతి బిందు సమస్యలు వచ్చాయని తెలిసింది వీరికి మోతి బిందు తదుపరి నందు ఆపరేషన్ కొరకు బోధన్ లైన్స్ క్లబ్ నందు నిర్వహించబడుతుంది వీరికి ఆపరేషన్ కొరకు ఆధార్ కార్డు ద్వారా ఉచితంగా నిర్వహించడం జరుగుతుంది . వీరికి భోజన వసతి కూడా కల్పించడం జరుగుతుంది మరియు మోతి బిందు ఏర్పడ్డ వారికి తీసుకువెళ్లి ఉచిత ఆపరేషన్ లైన్స్ క్లబ్ ద్వారా నిర్వహించడం జరుగుతుంది డాక్టర్ కె.వి.రెడ్డి మెమోరియల్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామ గ్రామంలోని ఉచిత కంటి వైద్య శిబిరం కూడా నిర్వహిస్తున్నాము అయితే పాత్రికేయుల ద్వారా కూడా ఈరోజు కొడచర్ల గ్రామంలో కూడా నిర్వహించుకోవడం జరిగింది లైన్స్ క్లబ్ ఫౌండర్ బసవేశ్వర ఆదేశాల మేరకు ఈరోజు ఇక్కడ పాత్రికేయుల ద్వారా ప్రెస్ క్లబ్ కొడిచెర్ల గ్రామ సర్పంచ్ మొండి కవిత ఇరవంత్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించినారు మండే కవిత సర్పంచ్ మాట్లాడుతూ కొడచర్ల గ్రామ ఈ యొక్క కంటి ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు కోటగిరి మండలం ఎస్సై శ్రీనివాస్ సార్ మాట్లాడుతూ మనకు కండ్లు చాలా ముఖ్యమైన అని తెలియజేశారు ఏదైనా చూడాలని రాయల్ అన్న కనులు చాలా అవసరమని కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు ఈ యొక్క క్యాంపును స్వద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు డాక్టర్ కె.వి రెడ్డి మెమోరియల్ క్యాంప్ ఇన్చార్జి టి హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి గ్రామ గ్రామంలోని ఈ ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహిస్తామని గ్రామ ప్రజలకు తెలియజేశారు ఈ క్యాంపు పోతంగల్ పాత్రికేయుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు డాక్టర్ కె.వి రెడ్డి మెమోరియల్ కంటి ఉచిత ఆపరేషన్ ప్రతి



గ్రామ గ్రామాల నిర్వహిస్తామని తెలిపారు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 56 మంది వచ్చి కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు వీరిలో 16 మందికి మోతీ మోతి బిందు సమస్యలు ఉన్నాయని తెలిసింది తద్వారి ద్వారా వీరికి ఆపరేషన్ కూడా ఉచితంగా నిర్వహిస్తామని లైన్స్ క్లబ్ ద్వారా తెలియజేసినారు ఈ కార్యక్రమంలో పొతంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుణ్య అర్జున్ ఉపాధ్యక్షులు చిరుత దత్తు ప్రధాన కార్యదర్శి వడ్ల సురేష్ కార్యదర్శి బేగరి విజయ్ సహాయ కార్యదర్శి ఎర్రర్ యాదవ్ కోశాధికారి లక్ష్మణ్ గౌరవ సలహాదారులు నూతలపల్లి గణేష్ కనకమెడల శ్రీనివాస్ హనుమాన్లు అసోసియేన్ ప్రెసిడెంట్ పాకాల గజేందర్ కార్యవర్గ సభ్యులు మొండి భీమ్రావు రాజేష్ హజారుద్దీన్ సద్దాం శ్రీకాంత్ శీను ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం జరిగే జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయాలన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు

**సంగారెడ్డి జూలై 17(ప్రజాక్షేత్రం):**

సదాశివపేటలో ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేది సోమవారం రోజున మధ్యాహ్నం 1:00 గంటలకు నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవాన్ని భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు పిలుపునిచ్చారు. శ్రీ జగన్నాథ రథయాత్రకు సంబంధించిన కరపత్రాన్ని ఇస్కాన్ టెంపుల్ భక్త బృందం సభ్యులు పులిమామిడి రాజుకు అందజేసి, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ, శ్రీ జగన్నాథ రథయాత్ర భారతీయ సనాతన ధర్మ వైభవాన్ని చాటిచెప్పే మహోత్సవమని అన్నారు. భక్తి, ఐక్యత, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర రథయాత్రలో ప్రతిu ఒక్కరూ పాల్గొని శ్రీ జగన్నాథ స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందాలని కోరారు.

ఈ రథయాత్ర సదాశివపేటలోని దుర్గమ్మ గుడి నుండి ప్రారంభమై శాస్త్రి రోడ్, సుభాష్ రోడ్, గాంధీ చౌక్ మీదుగా ప్రారంభమై సాయంత్రం 6:00 గంటలవరకు శ్రీ స్థానిక బసవ సేవాసదన్ ఫంక్షన్ హాల్ వరకు వైభవంగా కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హెచ్. హెచ్. భక్తి వైభవ స్వామి ప్రభుపాద ప్రచారక్ ప్రభువానంద దాస్ ప్రభుజీ విచ్చేసి భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించనున్నారని పేర్కొన్నారు. సదాశివపేట పట్టణంతో పాటు సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరూ కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో హాజరై ఈ దివ్య రథయాత్రను విజయవంతం చేయడంతో పాటు భగవంతుని కృపకు పాత్రులు కావాలని పులిమామిడి రాజు పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీ రామ్ ప్రభు, మాశెట్టి ప్రవీణ్ కుమార్,వేణు గోపాల్,రామ క్రిష్ణ,అభి రామ్ మరియు పి. ఎం. ఆర్ యవసేన నాయకులు రాగం అనిల్, గుణాకర్,తాలెల్మ



## జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు సుగురు రాముకు ఘన సన్మానం

- **చిట్యాల గ్రామ యువకుల శుభాకాంక్షలు.**
- **ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్ష**

**వనపర్తి,జూలై 17 (ప్రజాక్షేత్రం):**

ఇటీవల వనపర్తి జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సుగురు రాములుకు చిట్యాల గ్రామ శాలివాహన యువకులు ఘనంగా సన్మానం నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా సంఘ నాయకులు చిట్యాల రాము మాట్లాడుతూ శాలివాహన సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ జిల్లా వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సంఘ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. జిల్లా శాలివాహన సంఘం అభివృద్ధికి అందరి సహకారంతో పని చేస్తానని సుగురు రాములు హామీ ఇచ్చారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సంఘ నాయకులు, సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బుద్దారం నర్సింహ, బొడ్డపల్లి వెంకటేష్, గుమ్మడం నర్సింహ, చిట్యాల రాము, సుగురు వెంకటేష్, బాలకృష్ణ, అశోక్, రమేష్, రాజు, నరేందర్, అభి, రాజేష్, మహేష్, శివతో పాటు శాలివాహన సంఘానికి చెందిన యువకులు, సభ్యులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.






## చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీరాములు అందెల

**మహేశ్వరం జులై.17 (ప్రజాక్షేత్రం):**

ఇటీవల వనపర్తి జిల్లాకు చెందిన చంచరి భరత్ కుమార్ ఆటో డ్రైవర్ గా తన జీవనాన్ని కొనసాగిస్తూ తన ఆటో వెనక మతం మారడం అనేది తండ్రిని మార్చుకోవడంతో సమానం.ఈ భూమిపై పుట్టిన ప్రతి ఒక్కరు హిందువులే అని రాయగ ఆ యొక్క ఆటోను అత్తాపూర్ లో అన్యమతస్తుడు అడ్డుకొని పరుష పదజాలంతో దూషించి ఆటో భరత్ పై దాడి చేసిన నేపథ్యంలో ఈరోజు ఆటో భరత్ కు మద్దతుగా మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు మహేశ్వరం నియోజకవర్గ కాషాయ శ్రేణులతో కలిసి చార్మినార్ లోని శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆటో భరత్ రాసిన వ్యాఖ్యలతో కూడిన వాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హిందువులపై మరియు ఆలయాలపై దాడులు పెరుగుతున్నాయని ఆరోపించారు. హిందూ సమాజం తమ మత విశ్వాసాలను వ్యక్తీకరించే హక్కును కాపాడాలని, ఆటో భరత్‌పై జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ సమాజానికి సంబంధించిన ప్రతి అంశంలో బీజేపీ అండగా ఉంటుందని, భావ ప్రకటన స్వేచ్ఛను ప్రతి ఒక్కరికీ సమానంగా పరిరక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి , చాంద్రాయణగుట్ట కంటెస్టెడ్ ఎమ్మెల్యే మహేందర్, బిజెపి రాష్ట్ర నాయకులు, రంగా రెడ్డి, భాగ్యనగర్, గోల్కొండ జిల్లాల బిజెపి నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మహిళా మోర్చా నాయకురాలు, మరియు బీజేవైఎం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# త్వరలో అందుబాటులోకి పెద్దేముల్ తండా–ఇందూరు తారురోడ్డు

- **రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్**

**పెద్దేముల్, జూలై 17(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ తండా-ఇందూరు-దారునివాగు తండా వరకు చేపట్టిన తారురోడ్డు నిర్మాణ పనులను వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్ శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా రహదారి నిర్మాణ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా, ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా పనులు చేపట్టాలని ఆదేశించారు. పెద్దేముల్ తండా, ఇందూరు, దారునివాగు తండా ప్రాంత ప్రజలకు ఈ రహదారి ఎంతో కీలకమని,పనులు పూర్తయిన అనంతరం రాకపోకలు సులభతరం కావడంతో పాటు గ్రామాల మధ్య అనుసంధానం మెరుగుపడుతుందని తెలిపారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ రహదారి పూర్తయితే స్థానిక ప్రజలతో పాటు విద్యార్థులు, రైతులు, వాహనదారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.



# వినాయక మండపాలపై ఆంక్షలేంటి..?

- నిబంధనల పేరుతో అనుమతుల నిరాకరణ
- గణపతి ఉత్సవాల నిర్వహణలో పోలీసుల వివక్ష
- శాంతిభద్రతల పరిరక్షణలో వైఫల్యం
- పోలీసుల తీరుపై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఫైర్
- సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోవాలని డిమాండ్

**కరీంనగర్, జూలై 17(ప్రజాక్షేత్రం):**

గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో పోలీసులు అనుసరిస్తున్న వైఖరిపై కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని సప్తగిరి కాలనీలో వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసులు అనుమతులు నిరాకరించారని కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఆయన అక్కడ పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, ఒకప్పుడు తెలంగాణ పోలీసులకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉండేదని, ప్రస్తుతం కరీంనగర్‌లో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆరోపించారు. దాదాపు 38 ఏళ్లుగా గణపతి, దుర్గా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో ఇప్పుడు మండపాలు ఏర్పాటు చేయొద్దని చెప్పడం సమంజసం కాదన్నారు. ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, ఇతర మండపాలకు అనుమతులు నిరాకరించడం సరికాదని విమర్శించారు.

**దేవుడి విగ్రహాల రక్షణలో విఫలం**

బొమ్మకల్‌లో హనుమాన్ విగ్రహం చోరీ ఘటనను ప్రస్తావిస్తూ, దొంగలను పట్టుకోవాల్సిన పోలీసులు విగ్రహాన్ని వెతికి ప్రతిష్ఠించిన తనపై, బీఆర్ఎస్ నేతలపై కేసులు నమోదు చేయడం విచారకరమన్నారు. దేవుడి విగ్రహాలను కాపాడాల్సిన పరిస్థితి రావడం పోలీసు వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. తన క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా, పోలీస్ స్టేషన్‌కు పిలిపించి గౌరవంగా పంపించడం ఏ విధమైన న్యాయమని ప్రశ్నించారు. కరీంనగర్‌లో శాంతిభద్రతలను పరిరక్షించే బాధ్యత పోలీస్ కమిషనర్‌పై ఉందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని కరీంనగర్ పోలీసు వ్యవస్థను గాడిలో పెట్టాలని, ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించాలని గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.





## భరత్‌కు కొత్త ఆటో కొనిచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్

- హిందుత్వ నినాదాలున్న ఆటోను స్వయంగా నడిపిన కేంద్ర మంత్రి

**కరీంనగర్, జూలై 17(ప్రజాక్షేత్రం):**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం ఆటో డ్రైవర్‌గా మారి నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హిందుత్వ నినాదాలతో ఉన్న ఆటోను స్వయంగా నడుపుతూ జ్యోతినగర్ నుంచి మంకమ్మతోట, గీతాభవన్ చౌరస్తా, ప్రతిమ చౌరస్తా, బస్టాండ్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, బోయవాడ మీదుగా లక్ష్మీనగర్ వరకు దాదాపు ఐదు కిలోమీటర్ల మేర ప్రయాణించారు. ఆటోలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, ఆటో డ్రైవర్ భరత్ ప్రయాణించారు. అనంతరం లక్ష్మీనగర్‌లో ఆటో డ్రైవర్ చంచరి భరత్ కుమార్‌కు పాత ఆటో స్థానంలో కొత్త ఆటోను అందజేశారు. హిందుత్వ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేస్తున్న ప్రయత్నంపై భరత్‌ను అభినందించిన బండి సంజయ్, అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

**ఏం జరిగింది?**

వనపర్తి జిల్లాకు చెందిన చంచరి భరత్ కుమార్ తన ఆటో వెనుక భాగంలో "Changing your religion is like changing your father", "Anyone born on this earth is a Hindu... Jai Sriram" అనే హిందుత్వ నినాదాలను రాయించుకున్నాడు. ఈ నెల 13న మెహిదీపట్నం నుంచి జీడిమెట్లకు ప్రయాణికుడిని తీసుకెళ్తున్న సమయంలో మజ్లిస్ పార్టీకి చెందిన నలుగురు యువకులు ఆటోను అడ్డగించి నినాదాలను తొలగించాలని డిమాండ్ చేసినట్లు భరత్ తెలిపాడు. అనంతరం ఆటో వెనుక కవర్‌ను చించివేసి, నినాదాలను గీకేశారని ఆరోపించాడు. కొద్దిసేపటి తర్వాత అత్తాపూర్ ఎస్ఐ నుంచి ఫోన్ వచ్చి, ఆటోపై అలాంటి నినాదాలు ఎందుకు రాశావని ప్రశ్నిస్తూ, స్టేషన్‌కు రావాలని, లేకపోతే ఆటోను సీజ్ చేస్తామని హెచ్చరించినట్లు భరత్ వెల్లడించాడు. దీంతో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి భరత్ ఇటీవల కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్‌ను కలిసి జరిగిన ఘటనను వివరించాడు. ఫొటోలు, వీడియోలు పరిశీలించిన బండి సంజయ్, బాధపడవద్దని భరోసా ఇచ్చి, పాత ఆటో స్థానంలో కొత్త ఆటో కొనిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం కొత్త ఆటోను అందజేయడంతో పాటు హిందుత్వ నినాదాలున్న పాత ఆటోను స్వయంగా నడిపి తన మద్దతు ప్రకటించారు.

## రేవంత్ సర్కార్‌ను కూలుస్తాం

- నిరుపేదల స్థలాలు లాక్కుంటే అసెంబ్లీ ముట్టడికి ఆప్ పిలుపు

**మొయినాబాద్, జులై 17(ప్రజాక్షేత్రం):**

పేదల ఇళ్ల స్థలాలను లాక్కొని వారి కడుపు కొట్టాలని చూస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం తప్పదని ఆప్ కిసాన్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. హిమాయత్‌నగర్ గ్రామంలో 290 నిరుపేద కుటుంబాలకు చెందిన 60 గజాల ప్లాట్లను వెనక్కి తీసుకుని, అక్కడ వ్యవసాయ మార్కెట్ నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచన దుర్మార్గమైనదన్నారు. బాధితులు చేస్తున్న ధర్నా 22వ రోజుకు చేరిన సందర్భంగా ఆయన సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోకపోతే, బాధిత కుటుంబాలతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్టమీది శ్రీను, కుమ్మరి విఠల్, కరీం భాయ్, గోపాల్ నాయక్ తో పాటు పెద్ద సంఖ్యలో బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## పక్కగా భూముల రీసర్వే

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**అల్లాదుర్గం జులై 17(ప్రజాక్షేత్రం):**

మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో భూసమస్యలు తలెత్తకుండా, ప్రతి రైతుకు భూ హక్కులు కల్పించేలా భూమి రీ సర్వే చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. పక్కగా భూముల రీసర్వే చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అల్లాదుర్గం మండల కేంద్రం లోనీ నిర్వహించిన భూముల రీసర్వే గ్రామ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. భూ సమస్యలు తలెత్తకుండా ప్రతి రైతుకు భూ హక్కులు కల్పించేలా భూమి రీ సర్వే చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు. రైతులకు భూ వివాదాలు లేకుండా చేసి ప్రతి భూ కమతానికి భూధార్ అందిస్తామన్నారు. భూ పటాలను ప్రక్షాళన చేయాలన్నారు. పక్కగా భూ రీసర్వే చేసి హద్దులను నిర్ణయించేందు కే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం టేక్మాల్ మండలంలో విలేజ్ బౌండరీ సంబంధిత తాసిల్దార్ తో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు వివాదాలకు తావు లేకుండా రైతులకు మేలు చేకూరే విధంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ఈ కార్యక్రమం ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్ ,స్థానిక తహసిల్దార్, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## అల్లాదుర్గం ఎస్ఐ పేరుతో ఫేక్ ఐడీల కలకలం..

**అల్లాదుర్గం జులై 17(ప్రజాక్షేత్రం):**

మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శంకర్ పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ సోషల్ మీడియా ఖాతాలను సృష్టించి, ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్న ఉదంతం స్థానికంగా కలకలం రేపింది. అసలేం జరిగింది...? ఎస్ఐ శంకర్ పేరుతో ఒక అపరిచితుడు సోషల్ మీడియాలో ఫేక్ ఐడీలను క్రియేట్ చేశాడు. ఆ అకౌంట్ల ద్వారా బాధితులకు మెసేజ్లు పంపుతూ, అత్యవసరంగా డబ్బులు కావాలని డిమాండ్ చేస్తున్నట్లు గుర్తించారు. కొంతమందికి మెసేజ్లు వెళ్లడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై ఎస్ఐ శంకర్ స్పందించారు. తన పేరుతో ఫేక్ ఐడీలను సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. తన నుంచి ఎటువంటి డబ్బు అభ్యర్థనలు లేదా మెసేజ్లు వెళ్లలేదని ఆయన స్పష్టం చేశారు. మండల ప్రజలు ఇటువంటి మోసపూరిత మెసేజ్లను నమ్మవద్దని, ఎవరూ తొందరపడి డబ్బులు పంపవద్దని ఎస్ఐ శంకర్ కోరారు. సోషల్ మీడియాలో వచ్చే అనుమానాస్పద మెసేజ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే ఫోన్ ద్వారా లేదా నేరుగా కలిసి నిజానిజాలు ధృవీకరించుకోవాలన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే స్థానిక పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.




## హాస్టల్స్ హటావో 14వ వార్డ్ బచావో

**చౌటుప్పల్, జూలై 17(ప్రజాక్షేత్రం):**

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు కౌండిన్య నగర్ మరియు విశ్వకర్మ కాలనీ వాసులు, తమ కాలనీలో నిర్వహిస్తున్న కొన్ని మహిళల హాస్టళ్ల వల్ల స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ, చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ కు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. కాలనీ వాసుల ప్రకారం, రాత్రి వేళల్లో అధిక రాకపోకలు, ద్విచక్ర వాహనాలపై వేగంగా సంచరించడం, బహిరంగ ప్రదేశాల్లో గుంపులుగా చేరడం వంటి అంశాల వల్ల మహిళలు, వృద్ధులు మరియు స్థానిక కుటుంబాలు అసౌకర్యానికి గురవుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను పరిశీలించాలని వారు కోరారు. అలాగే సంబంధిత హాస్టళ్లు అన్ని చట్టబద్ధమైన అనుమతులతోనే నిర్వహించబడుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. అవసరమైతే పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని కాలనీలో నిఘా పెంచి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు .ఈ సందర్భంగా 14వ వార్డు కౌండిన్య నగర్ మరియు విశ్వకర్మ కాలనీ వాసులు, తమ కాలనీలో శాంతి, భద్రత మరియు ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## ఆపద్బాంధవుల సాహసం.. డోలీ మోతతో ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది!

**ములుగు జులై 17(ప్రజాక్షేత్రం):**

ప్రభుత్వాలు మారుతున్నా మారుమూల గిరిజన ప్రాంతాల సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. కనీస రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లోనూ రోగులను డోలీలపై మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో విధినే దైవంగా భావించిన 108 అంబులెన్స్ సిబ్బంది అసాధారణ సాహసం చేసి ఓ యువకుడి ప్రాణాలను కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటిడిఎ పరిధిలోని గుర్రాలబావి గ్రామానికి చెందిన గోత్తికోయ గిరిజన యువకుడు మడకం అయితయ్య (18) గత నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడక, పరిస్థితి విషమించడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటి) శివలింగం ప్రసాద్, పైలట్ కోటి హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. అయితే గ్రామానికి వెళ్లే రహదారి లేకపోవడంతో అంబులెన్స్ ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అయినా వెనుకడుగు వేయని 108 సిబ్బంది బురదతో నిండిన కాలిబాటలో నడుచుకుంటూ గ్రామానికి చేరుకుని, గ్రామస్థుల సహాయంతో బాధితుడిని డోలీలో మోసుకుంటూ ప్రధాన రహదారి వరకు తీసుకొచ్చారు. అనంతరం అంబులెన్స్‌లో ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా రక్తంలో చక్కెర స్థాయి ప్రమాదకరంగా పడిపోవడంతో పాటు తీవ్ర జ్వరం ఉన్నట్లు గుర్తించారు. ఈఆర్సీపీ డాక్టర్ మౌనిక సూచనల మేరకు అత్యవసర చికిత్సగా గ్లూకోజ్, అవసరమైన మందులు, ఇంజెక్షన్లు అందించి, వెంటనే ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి పరిస్థితిని వైద్యులకు పూర్తిగా వివరించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. కనీస రహదారి సౌకర్యం లేకపోయినా ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో విధులు నిర్వహించిన 108 అంబులెన్స్ సిబ్బంది సేవలను స్థానికులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ప్రశంసించారు. ఇలాంటి సేవాభావంతో పనిచేస్తున్న 108 సిబ్బంది నిజమైన ఆపద్బాంధవులని కొనియాడుతూ, మారుమూల గిరిజన గ్రామాలకు తక్షణమే రహదారి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## నేరేడుగుంటలో విద్యార్థులకు పాఠశాల బ్యాగుల పంపిణీ

**అందోల్ జులై 17(ప్రజాక్షేత్రం):**

ఆందోల్ నియోజకవర్గం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి ఉన్నత భవిష్యత్తుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు తమ గ్రామపంచాయతీ తరఫున ఎల్లప్పుడూ అందజేస్తామని జోగిపేట మండల పరిధిలోని నేరేడు గుంట గ్రామ సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని నేరేడు గుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (నేరేడుగుంట ప్రైమరీ స్కూల్ ) విద్యార్థులకు శుక్రవారం నాడు ఆయన వ్యక్తిగత చొరవతో ఉచిత పాఠశాల బ్యాగులను (స్కూల్ బాగ్స్ డిస్ట్రిబ్యూషన్ ) సాదరంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యార్థుల ప్రోత్సాహక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. చిన్నతనం నుంచే పట్టుదల అవసరం – సర్పంచ్ సాయికిరణ్ పిలుపు సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే చిన్నతనం నుంచే చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పట్టుదలతో కష్టపడి చదవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రభుత్వ పాఠశాలలపై ఆధారపడే పేద విద్యార్థుల కుటుంబాలకు కొంతైనా చేదోడు వాదోడుగా ఉండాలనే సత్సంకల్పంతోనే ఈ వినూత్న విద్యా సామగ్రి మరియు బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో పాఠశాల మౌలిక వసతుల కల్పనకు కూడా తమ వంతు కృషి చేస్తామన్నారు. సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్ పాఠశాల ఉపాధ్యాయుల ప్రశంసలు గ్రామ సర్పంచ్ తీసుకున్న ఈ విద్యా ప్రోత్సాహక నిర్ణయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ పంపిణీ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొందని పేర్కొన్నారు. ఈ అధికారిక విద్యా సేవా కార్యక్రమంలో నేరేడు గుంట గ్రామ ఉప సర్పంచ్ కోదండ ఈశ్వర్, స్థానిక వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## చౌటుప్పల్‌లో సిపిఎం ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయండి

- గంగాదేవి సైదులు

**చౌటుప్పల్, జూలై 17(ప్రజాక్షేత్రం):**

సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో 2026 జూలై 20న ఉదయం 10.30 గంటలకు చౌటుప్పల్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్లో నిర్వహించే ప్రాంతీయ సదస్సును పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని సిపిఎం చౌటుప్పల్ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు పిలుపునిచ్చారు.ఈ ప్రాంతీయ సదస్సుకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ బీవీ రాఘవులు గారు ముఖ్య వక్తగా హాజరై ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు.పార్టీ జిల్లా, మండల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, పార్టీ శాఖల కార్యదర్శులు, పార్టీ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు అదేవిధంగా ఈరోజు పంతంగి అంకిరెడ్డిగూడెం ఎస్ లింగోటం జైకేసారం కుంట్ల గూడెం మందోల్లగూడెం పెద్ద కొండూరు చిన్న కొండూరు మల్కాపురం తూపు రాము పేట కైతాపురం ధర్మోజి గూడెం పార్టీ నాయకులకు ఆహ్వానాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయ యాదయ్య మండల కమిటీ సభ్యులు పొట్ట శ్రీనివాస్, పల్లె మధు, కృష్ణ, బోదాస్, వెంకటేష్, ఎల్లమల్ల, సంజీవ, జక్కిడి దేవేందర్ రెడ్డి, మీసాల శీను, శాఖ కార్యదర్శులు రత్నం శ్రీకాంత్, జక్కిడి రమణారెడ్డి, కొంతం శ్రీనివాస్ రెడ్డి, గుండ్ల మహేష్, పురుషోత్తం, తగరం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.






# హెల్మెట్ పెట్టుకోండి ప్రాణాలను కాపాడుకోండి

**చౌటుప్పల్ జూలై 17(ప్రజాక్షేత్రం):**

చౌటుప్పల్ మున్సిపాలిటీ పట్టణంలో ఉన్న ట్రినిటీ హైస్కూల్లో ఈరోజు రోడ్డు భద్రత అవగాహన సదస్సు జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేశం హాజరైనారు ఈ కార్యక్రమాల్లో విద్యార్థులకు ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులకు రోడ్డు భద్రత పై అవగాహన గురించి ట్రాఫిక్ రూల్స్ వివరించారు విద్యార్థులు వివిధ ట్రాఫిక్ రూల్స్ మీ ఇంట్లో పెద్దవారికి ఈ విషయాలు చెప్పాలని అన్నారు ముఖ్యమైన పది ట్రాఫిక్ రూల్స్ విద్యార్థులకు వివరించారు హెల్మెట్ లేకుండా బండి నడపవద్దని మరియు మొబైల్స్ మాట్లాడుతూ బైకు రైడింగ్ చేయవద్దని అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్ సిగ్నల్ ఉన్నప్పుడు రోడ్డు దాటవలనని మరియు ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని బండి నడుపునప్పుడు ఇండికేటర్స్ తప్పకుండా వాడవలనని అలాగే నో పార్కింగ్ వద్ద వెహికల్ ని పార్కింగ్ చేయవద్దని విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ గురించి వివరంగా వివరించారు అలాగే విద్యార్థుల చేత తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ట్రినిటీ హై స్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు ప్రిన్సిపాల్ కం డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల ట్రాఫిక్ ఎస్ఐ జి సైదిరెడ్డి ఆర్ ఎస్ ఐ ఆంజనేయులు ఏఎస్ఐ జంగయ్య మరియు ట్రాఫిక్ సిబ్బంది మరియు ఉపాధ్యాయ ఉపాధ్యాయుడు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం ప్రిన్సిపాల్ మంజుల తమ విద్యార్థులకు ఎంతో విలువైన సమయాన్ని వెచ్చించి ట్రాఫిక్ రూల్స్ వివరించేందుకు ట్రాఫిక్ సిఐ ని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# డీఈఓకు వినతిపత్రం సమర్పించిన ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ గాడేకర్ మహేశ్వర్

**నిర్మల్ జిల్లా జూలై 17(ప్రజాక్షేత్రం):**



నిర్మల్ జిల్లా విద్యా రంగంలో వెనుకబాటుతనాన్ని దూరం చేసేందుకు, విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత చదువులను అందుబాటులోకి తెచ్చేందుకు తక్షణమే జిల్లాలో నవోదయ విద్యాలయం, సైనిక్ స్కూల్, కేంద్ర విద్యాలయం (కేవీ) లను ఏర్పాటు చేయాలని మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ గాడేకర్ మహేశ్వర్ డిమాండ్ చేశారు. జిల్లా ఎదుర్కొంటున్న పలు విద్యా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆయన ఎంఎస్ఎఫ్ నాయకుల బృందంతో కలిసి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ని కలిసి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా గాడేకర్ మహేశ్వర్ మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లా ఏర్పడి ఇన్నేళ్లు గడుస్తున్నా విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యావకాశాలు కల్పించే కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ప్రతిష్టాత్మక పాఠశాలలు అందుబాటులోకి రాకపోవడం విచారకరమన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్యతరగతి ప్రతిభావంతులైన విద్యార్థులు నాణ్యమైన విద్య కోసం ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి జిల్లాకు నవోదయ, సైనిక్, కేంద్ర విద్యాలయాలను తక్షణమే మంజూరు చేయించేలా చొరవ చూపాలని కోరారు.

# ముసురు పట్టాలి మురిసిపోవాలి దేగాం గ్రామంలో దేవతలకు జలాభిషేకం!

**నిర్మల్ జిల్లా జూలై 17(ప్రజాక్షేత్రం):**

భైంసా మండలం దేగాం గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ఊరువాడా సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ దేగాం గ్రామ (విడిసి) గ్రామ పంచాయతీ ప్రతినిధులు, గ్రామస్థులు వరుణ దేవుని కృప కోసం పవిత్ర సంకల్పం చేపట్టారు. మన పూర్వీకుల కాలం నుండి ప్రకృతి శక్తులను పూజించడం ఒక పవిత్రమైన ఆనవాయితీగా వస్తోంది. ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, వర్షాలు లేక అల్లాడుతున్న భూమాతకు పచ్చని కళ రావాలని గ్రామంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, రైతులు ఎంతో భక్తిశ్రద్ధలతో పవిత్ర గంగ నీటిని కావిళ్లతో సేకరించి, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకువచ్చారు. ఆ పవిత్ర జలాలతో గ్రామ దేవతలకు ఘనంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రతినిధులు మాట్లాడుతూ.. వరుణ దేవుని కృపాకటాక్షాలు ఊరిపై ప్రసారమై, సకాలంలో ముసురు పట్టి చెరువులు, కుంటలు జలకళలాడాలని ఈ పూజలు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా దేశానికి వెన్నెముక అయిన రైతన్నలు సకాలంలో విత్తనాలు వేసుకుని, పచ్చని పంటలతో పొలాలు కళకళలాడాలని వరుణ దేవుడిని వేడుకున్నారు. వర్షాలు కురిస్తేనే రైతుల ఇళ్లలో సంతోషం వెల్లివిరుస్తుందని, పంటలు సమృద్ధిగా పండి అప్పుల బాధలు తీరాలని భగవంతుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో పాడిపంటలు వర్ధిల్లి, ప్రతి రైతు కుటుంబం ఆనందంగా ఉండాలన్నదే తమ పవిత్ర సంకల్పమని వివరించారు. ఈ వేడుకలో గ్రామ పంచాయతీ సభ్యులు, రైతు సంఘాల నాయకులు, అన్నదాతలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



# మహిళలు ఆషాడంలో ఆనందంగా జరుపుకునే గోరింటాకు పండుగ అందం...ఆరోగ్యం...అతివలకు

**శంకర్‌పల్లి జులై 17(ప్రజాక్షేత్రం):**



శ్వేత



పరమేశ్వరి



నీరజ



జయశ్రీ



సాహితి

గోరింటా పూసింది కొమ్మ లేకుండా మురిపాల అరచేత మొగ్గ తొడిగింది అన్నాడు ఓ సిని కవి. కృత్రిమ ఎరుపు కంటే ఆరోగ్యం ఇచ్చే గోరింట మిన్న ఆషాడం వచ్చింది అంటే చాలు గోరింటాకు ప్రతి ఒక్క మహిళలకు గుర్తొస్తుంది. ఆషాడ మాసం ముగిసే లోపు ఒక్కసారైనా గోరింటాకు పెట్టుకోవాలని పూర్వికులు చెబుతారు. అందుకే ఆషాడం అంటే గోరింటాకు పండుగ అంటారు. గోరింటాకు చేతులకు పెట్టుకొని యువతులు ఎంతో మురిచిపోతూ ఉంటారు. శుభకార్యాలు పండుగలు ఆషాడ మాసంలోనే, ఔషధణాలు గోరింటాకులో ఎక్కువగా ఉంటాయి. ఇటీవల కాలంలో మహిళలందరూ ఒకేచోట చేరి మెహందీ పడుగగాను చేసుకోవడం. కిట్టి పార్టీలో కూడా ఆషాడ మొహిందీ పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలు ఒకచోట గోరింటాకు పెట్టుకునేటప్పుడు మహిళలు ఎంతో సందడిగా ఉత్సాహంతో ఉంటారు. చర్మవ్యాధులు రాకుండా వర్షాకాలంలో గోరింటాకు పెట్టుకుంటే చర్మవ్యాధులు రాకుండా రక్షించుకోవచ్చు అనేది ఎప్పటి నుంచో వస్తున్న మన సంప్రదాయం ఆరోగ్య రహస్యం, ఆషాడ మాసంలో వర్షాలు ఎక్కువగా కురవడంతో పొలాలు బురదగా మరి క్రిమికీటకాలు వస్తుంటవి. మహిళల పొలాల్లో వరినాట్లు వేయడం వలన చేతులు కాళ్ళకు బురద అంటుకుంటుంది. ఈ ఆషాడ మాసంలో మైదాకు పెట్టుకుంటే చర్మవ్యాధులు రాకుండా కాపాడుతాయని వైద్యులు పలువురు చెబుతున్నారు.

**ఆషాడ మాసం యొక్క ప్రత్యేకత**

ఆషాడ మాసంలో ఏదో ఒక రోజు గోరింటాకు పెట్టుకోవాల నేది మన పూర్వీకులు చెప్పిన సంప్రదాయం. ఆనాటి నుండి సాంప్రదాయాలు అదేవిధంగా నేటి వరకు కొనసాగుతున్నాయి. గోళ్ళకు రంగును ఇచ్చే గోరింటాకు సఖరంజని అనే పేరు కూడా ఉంది. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేటి ఆధునిక కాలంలో గోరింటాకు పేరుతో రకరకాల కోన్లూ పేస్టులు మహిళలకు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఆ కోన్లు పేస్టులు రంగును అందాన్ని ఇస్తాయి తప్ప వాటిలో ఎలాంటి ఔషధ గుణాలు ఉండవు.

**గోరింటాకు ప్రయోజనాలు**

మైదాకు వేళ్లకు పెట్టుకోవడం, గోళ్ళు పెలుసు బారిపోకుండా కాపాడుతుంది. ఆకులే కాకుండా పూలు, వేర్లు, బెరడు విత్తనాలు కూడా ఔషధ యుక్తాలే. వీటితో శరీరంలోని ఎలర్జీను దూరం చేసుకోవచ్చు. బోధకాలు వ్యాధి ఎలాంటి దరిచేరదు. నెలకు ఒకసారి గోరింటాకు ముద్దను తలకు ప్యాక్ చేసుకుంటే జుట్టు బలపడి రాలదుంటాకు ఉంటుంది. గోరింటాకు పొడి కాచిన నూనె వాడడం చిట్కా వైద్యంలో ఒకటి. గోరింటాకు ముఖ్యంగా ఒంట్లో వేడిని తగ్గిస్తుంది.

**గోరింటాకు తయారు చేసే విధానం**

మైదాకులో చింతపండు వేసి మధ్యలో కొద్దిగా మజ్జిగా వేసి రోట్లో రుబ్బాలి. మిక్సీలోన నాణ్యమైన గోరింటాకు ఇత్తలూ ఆకులు పొడిని వేడి నీళ్ళలో కలిపి రాత్రంతా నానబెడితే మంచి రంగులోకి మారుతుంది. మెహందీకు కాపా పొడిని కలిపి రాత్రంతా నానబెట్టాలి. తర్వాత రోజు పెట్టుకోవాలి దీంతో కాఫీ బ్రౌన్ కలర్లో పండుతుంది. నెంబర్ వసంతంలో పంచదార తయారు చేసుకోవాలి. పెన్నాకు కాఫీ పొడిని కలిపి రాత్రంతా నానబెట్టాలి తర్వాత రోజు పెట్టుకోవాలి

**సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక: జయశ్రీ**

ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం అనేది సంస్కృతి సాంప్రదాయంగా వచ్చే ఆనవాయితీ, వర్షాకాలం వస్తే ఆరోగ్య బారిన పడకుండా గోరింటాకు శరీరానికి వెచ్చదనాన్ని ఇస్తుంది. ఎలాంటి వ్యాధులు రాకుండా కాపాడుతుందని మాశెట్టి జువెలర్స్ ఓనర్ జయశ్రీ తెలిపారు.

**చిన్ననాటి నుండి వస్తున్న ఆచారం:శ్వేత**

ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం అనేది చిన్ననాటి నుండి ఒక ఆనవాయితీ చిన్నతనం నుండి గోరింటాకు పెట్టుకుంటున్నాను. గోరింటాకును పోసి రోట్లో వేచి దంచి పాడపాడుతూ ఒకే చోటకు చేరి గోరింటాకును పెట్టుకునే వాళ్ళం అని శ్వేత బ్యాంగిల్ స్టోర్ ఓనర్ తెలిపారు.

**గాజులు ఇచ్చి పుచ్చుకుంటాం: నీరజ**

ఆషాడం వచ్చింది అంటే గాజులు ఇచ్చిపుచ్చుకుంటాం. ఆషాడం వచ్చిందంటే ముందుగా గుర్తిచ్చేది గోరింటాకు. అందరం ఒకేచోట చేరి గోరింటాకు పెట్టుకోవడంతో గాజులు ఇచ్చిపుచ్చుకుంటాం. అమ్మవారికి పూజలు నిర్వహించి గోరింటాకు పెట్టుకోవడం ఎంతో ఆనందంగా ఉంటుందని కాశెట్టి నీరజ తెలిపారు.

**అనాదిగా వస్తున్న ఆచారం: పరమేశ్వరి**

గోరింటాకులో "మంచి ఔషధ గుణాలు ఉన్నాయి. గోరింటాకు పెట్టుకోవడం అనేది అనాదిగా వస్తున్న ఆచారం. సాంప్రదాయమే కాకుండా వాతావరణంలో వచ్చే మార్పుల వలన శరీరంలో వచ్చే మార్పులను తొలగించే మంచి ఔషధం గోరింటాకు ఉంది. అందుకే ఆషాడంలో తప్పకుండా గోరింటాకు పెట్టుకుంటాం అని గృహిణి పరమేశ్వరి అన్నారు.

**సంప్రదాయం... ఔషధం : సాహితి**

మైదాకు చేతులకు పెట్టుకోవడం సంప్రదాయంతో పాటు మంచి ఔషధం. ఇది పూర్వం నుంచి వస్తున్న ఆచారం. నేడు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కోన్లు వచ్చాయి. కోన్లను వాడాల్సి వస్తుంది. మంచి కంపెనీలకు చెందిన గోరింటాకు కోన్లలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. శుభకార్యాలకు మహిళలు తప్పక మైదాకు పెట్టుకుంటున్నారని అన్నారు.

# ప్రారంభానికి నోచుకోని దేగాం పల్లె దవాఖాన

**నిర్మల్ జిల్లా జులై 17(ప్రజాక్షేత్రం):**



భైంసా మండలం దేగాం గ్రామంలో ప్రజల ఆరోగ్య అవసరాల కోసం లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన పల్లె దవాఖాన భవనం మూడేళ్లు గడిచినా ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోకపోవడం శోచనీయమని గ్రామ సర్పంచ్ సిరం సుష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణం పూర్తయి ఇన్నేళ్లు అవుతున్నా అధికారులు దీనిని ప్రారంభించకపోవడాన్ని ఆమె తీవ్రంగా తప్పుపట్టారు.ఈ తీవ్రమైన సమస్యపై ఆమె స్పందిస్తూ, దేగాం గ్రామంలో నిర్మించిన ఈ పల్లె దవాఖాన భవనాన్ని వెంటనే ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అధికారుల ఉదాసీనత మరియు నిర్లక్ష్య వైఖరి కారణంగానే స్థానిక ప్రజలు సరైన సమయానికి వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె ఆరోపించారు. ఈ దవాఖానను గనుక త్వరగా ప్రారంభిస్తే, దేగాం గ్రామానికే కాకుండా దీని చుట్టుపక్కల ఉన్న పరిసర గ్రామాల ప్రజలకు సైతం ఎంతో మేలు జరుగుతుందని, వారికి తగిన వైద్య సేవలు సకాలంలో అందుతాయని ఆమె పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న ఈ ఇబ్బందికర పరిస్థితిని, దవాఖాన భవనం వృథాగా పడి ఉన్న విషయాన్ని తాము ఇప్పటికే జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచ్ సుష్మారెడ్డి వెల్లడించారు. కాబట్టి జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పల్లె దవాఖాన భవనాన్ని వెంటనే ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# స్కూల్ బస్సును ఢీకొన్న రైలు..ఐదుగురు మృతి

**పశ్చిమ బెంగాల్ జులై 17(ప్రజాక్షేత్రం):**



పశ్చిమ బెంగాల్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ముర్షిదాబాద్‌లో స్కూల్ బస్సును రైలు ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. వీరిలో ఇద్దరు విద్యార్థులున్నారు. మరికొందరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఓ స్కూల్ బస్సు కర్ణసుబర్ణ రైల్వే క్రాసింగ్ దగ్గర పట్టాలు దాటుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో బస్సు పెద్ద మొత్తంలో ధ్వంసం అయిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారని వివరించారు. లోపల చిక్కుపోయిన విద్యార్థులను బయటకు తీసి ముర్షిదాబాద్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై ప్రత్యక్ష సాక్షి ఒకరు మాట్లాడుతూ 'ప్రమాదం జరిగిన సమయంలో రైలు గేట్లు తెరిచి ఉన్నాయి. బస్సు పట్టాలు దాటుతుండగా ఒక్కసారిగా రైలు వచ్చి ఢీకొట్టింది' అని అన్నారు. రైల్వే శాఖ ప్రాథమిక విచారణలో కూడా ఇదే బయటపడింది. రైల్వే గేట్‌మెన్ నిర్లక్షం కారణంగానే దుర్ఘటన చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. అతన్ని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

# గృహజ్యోతి లబ్ధిదారులకు ఎల్‌నినో షాక్!

- **200 యూనిట్ల పరిమితి మించి విద్యుత్తు వాడకం**
- **జూన్‌లో 4 లక్షల మందికి పథకం దూరం**
- **జీరో బిల్లు బదులు పూర్తిగా చెల్లించాల్సిన పరిస్థితి**

**హైదరాబాద్ జులై 17(ప్రజాక్షేత్రం):**

గృహజ్యోతి పథకం లబ్ధిదారులపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతోంది. గృహజ్యోతి కింద ఇళ్లలో 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించిన లబ్ధిదారులకు జీరో బిల్లు వస్తుంది. అంటే వారు బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే, ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొనడమే కాక ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. వానా కాలంలోనూ ఉక్కపోత కొనసాగుతోంది. దీంతో ఇళ్లలో ఫ్యాన్లు, కూలర్ల వాడకం వేసవి మాదిరిగానే కొనసాగుతోంది. అలాగే, వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటడంతో.. ఇళ్లలోని మోటార్లు, బోర్లు నడిపే సమయం కూడా పెరిగిపోయింది. దీంతో నెలవారీ విద్యుత్ వినియోగం 200 యూనిట్ల పరిమితి దాటుతుంది. దీంతో గృహజ్యోతి లబ్ధిదారులు జీరో బిల్లుకు దూరమవుతున్నారు. ఒక్కసారిగా మొత్తం బిల్లు చెల్లించాల్సి రావడంతో ఆ బిల్లు మొత్తాన్ని చూసి కంగు తింటున్నారు. కొన్ని చోట్ల బిల్లులను చూసి విద్యుత్ సిబ్బందితో గొడవలు పడుతున్నారు. ఇలా ఎల్‌నినో దెబ్బకు గృహజ్యోతి పథకానికి దూరమవుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 18 జిల్లాల్లో జూన్ నెలలో నాలుగు లక్షల మందికి గృహజ్యోతి పథకం కట్ అయింది. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో మొత్తం 26.54 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా జూన్‌లో 22.59 లక్షల మందికి మాత్రమే జీరో బిల్లులు వచ్చాయి. వీరికి రూ.99.18 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం చెల్లించింది. మార్చి నుంచి జూన్ వరకు 6.49 కోట్ల మందికి జీరో బిల్లులు రాగా వీరు రూ.2355 కోట్ల సబ్సిడీ పొందారు. కాగా, ఎన్‌పీడీసీఎల్ పరిధిలో గత మూడు నెలల కాలంలో 5384 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది.




# 9 ఏళ్ల బాలికపై అత్యాచారం..

- **మైనర్ బాలికపై అత్యాచారం**
- **సీసీ కెమెరాల్లో దృశ్యాలు రికార్డు**
- **జనం దాడిలో నిందితుడు మృతి**

**హైదరాబాద్ జులై 17(ప్రజాక్షేత్రం):**



హైదరాబాద్ నగరంలో అత్యంత దారుణమైన సంఘటన వెలుగుచూసింది. కులసుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలో తొమ్మిదేళ్ల మైనర్ బాలికపై ఓ వ్యక్తి అమానుషంగా అత్యాచారానికి ఒడిగట్టాడు ఓ కిరాతకుడు. ఈ అకృత్యానికి సంబంధించిన దృశ్యాలన్నీ స్థానిక సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. తమ చిన్నారిపై జరిగిన ఘోరాన్ని సీసీటీవీ ఫుటేజ్ ద్వారా గమనించిన తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు, ఆక్రోశానికి గురయ్యారు. ఈ దారుణం గురించి తెలియగానే ఆగ్రహంతో ఊగిపోయిన బాలిక తల్లిదండ్రులు, స్థానికులు కలిసి నిందితుడిపై తీవ్రంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సదరు నిందితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ చికిత్స పొందుతూ నిందితుడు మరణించాడు. ప్రస్తుతం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394